# ప్రజాకళ

ప్రజాస్వామిక సాహిత్య పత్రిక

## అంతర్జాతీయ మహిళా దినం: మార్చి 8



దేశాలమధ్య శత్రువ్యూహాల్ని
శవాలు లెక్కతేలుస్తాయి
దేశాల మధ్య వ్యాపార సంబంధాలు అంకెల్తోసహా దొరుకుతాయి
అక్కాతమ్ముళ్ళమధ్య
ఇప్పుడు రక్త సంబంధం ఒక వలస రాగ సంబంధం, ఒక వెట్టి

మార్చి 2007 సంచిక

మీ రచనలు, అభిప్రాయాలు పంపించండి, నిర్మాణాత్మక చర్చలో పాల్గొనండి
Editor@Prajakala.org

సూచిక

## కవిత్వం:


అమ్మా! అమ్మా! - కె.శివారెడ్డి ........ 3

మల్టీనేషనల్ ముద్దు - కొండేపూడి నిర్మల........ 6

పడిగాపులు - కౌముది ........ 7

ప్రజాస్వామ్యం - హెరాల్డ్ పింటర్ ........ 12


## వ్యాసాలు:


'మహా ' శ్వేతా దేవి - పి. సత్యవతి........ 13

అంతర్జాతీయ మహిళా దినం - రంగనాయకమ్మ........ 19

మన సమాజంలో ఇలా జరుగుతుందా? - ఉషా ఆరి ........ 20

అపోహలూ, గుడ్డినమ్మకాలూ - డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్........ 25


## కథ:


సెగమంటలు - దాదా హయత్ ........ 28


## ఉల్లేఖనాలు:


స్త్రీ సాహిత్యం - ఉల్లేఖనాలు ........34


## ఆడియో/వీడియో:


ఓల్గా రచనలు: ప్రసంగాలు ........36

అమ్మా తెలంగాణమా! ఆకలి కేకల గానమా! ........ 36

ఆదివాసుల ఆత్మబంధువు ఏడీకెళ్ళెనే - విమల ........37

గమనిక: 37

## అమ్మా! అమ్మా!

- కె.శివారెడ్డి

కళ్ళకింద బావులేర్పడతాయి
మొగ్గల్లా ముఖంమీదకి పొడుచుకొచ్చి విప్పారిన కళ్ళు
ఇప్పుడు బావిలో పడిపోయిన మట్టిముంతలు
సూర్యోదయం మీద లేతతతమలపాకులా నవనవలాడిన
ముఖం నేడు అనూహ్యఅకాల జీర్ణపత్రం
ఒకప్పుడు అన్ని కాలాలూ మిళితమై
ఆమె ముఖంలో లాస్యం చేసేవి

అప్పుడామెకి చిగిరించటమొక్కటే తెలుసు
సారవంతభూమిలా పరిమళించేది, విత్తనమే కాదు
వేలుబెట్టినా మెలకెత్తుతుందోమోనని భయంవేసేది
ఉదయంపూట అలా కొండలమీంచి ఉద్యానవనాల మీంచి
కదిలొచ్చే నీలిమేఘాల గుంపును చేస్తే
తెలిసేది ఆమంటే ఏమిటో —

కాలికింద కదిలిపోయే రోడ్డు కానీ
చేయి కింద జారిపోయే నీళ్ళుకానీ
ఒక ఉన్నత్త ఆనందపారవశ్యంతో స్వర్గారోహణకన్నట్టు
కదునుతొక్కేవి -

ప్రపంచం ఇక అద్భుతపక్షై తన చుట్టూ తిరిగేది
పగటి ఎండలూ వెన్నెల రాత్రిళ్ళూ కలగలసి ఒక వినూత్న
కాంతిగా మారి ఆమె అనే లోయంతా పర్చుకునేవి
వేనవేలుగా చిన్నపిల్లలనే తోటలన్నీ ఆమెనిండా దరహాసించేవి
ఏ గుడివద్దో, మజీదువద్దో ఒక్కసారిగా లేచిన పావురాల
గుంపులన్నీ ఆమె కళ్ళల్లో కదలాడేవి -
తెల్లవారు ఝామున నాలుగ్గంటల మహానగరంలా ఉండేది

కాలువకట్టమీదుగా పరుగెత్తే టెలుఫోను తీగలా నిత్యం
విచిత్రనాదం చేసేది -

అన్ని పొద్దుటిపూటల అన్ని సాయంకాలాల
నిర్మలానందోత్సాహాల జలతరంగిణి ఆమె -

ఇప్పుడేముంది
మధ్యబిందువు నుంచి అన్నివైపులకి అనేకముఖాలుగా
చీలిపోయి వాసనా, రుచిలేని ఒకానొక విచిత్ర ముకురపుష్పం
ఎన్నాళ్ళకిందో గోడమీద రాయబడి లీలగా ఛాయ మాత్రమే
మిగిలిపోయిన ఉద్రేకపూరిత గొప్ప పోరాట నినాదం -
పోయే రైలు అద్దంలోంచి చూస్తే వెనక్కి మరీ మరీ వెనక్కి
జరిగిపోయే అనేక గ్రామాల అస్పష్ట అమాయకపు రూపు రేఖ
ఎప్పుడో ఏ నక్షత్రం నుంచో బయల్దేరిన కిరణం భూమిని చేరక
అలానే మార్గమధ్యంలో నిలచిపోయినట్లు —
ఇప్పుడు ఖాళీకుండీలు మాత్రమే మిగిలిన ఒక్కప్పటి అద్భుతమైన
మృదులాంకుర తరళ సౌందర్యరాశి గొప్ప నర్సరీ —
చల్లనీ నీటిగాలిలా ప్రసరించిన తల్లి, పరవశింపచేసిన తల్లి,
నేడు విస్తీర్ణ యిసుకసముద్రాల సామ్రాజ్యం —

పైకప్పు కూల్తుంటే —
వాకిళ్ళూ, కిటికీలూ పీక్కెళ్ళిన శూన్యనేత్రాల గృహం
ఆ పక్కా ఈ పక్కా తెగ్గొట్టబడి, విసర్జించబడిన రోడ్డు —
ఆమెకందరూ ఉన్నారు, తల్లిదండ్రులూ, బంధుకోటి, భర్తపిల్లలూ -
ఎందరున్నా ఏకాకిగా మిగిలిపోతున్న ఈ దేశం ఆడది ఆమె
అందరి జన్మలకూ అభివృద్ధికీ కారణభూతమైన ఆమె ఆమెగానే
మిగిలిపోతుంది
అందరి అవసరాలు తీర్చుతూ ఎవ్వరికీ చెందనీ ఆదిమతల్లి

యుగయుగాల పవిత్ర దాసి —

లోతు తెలియని శారీరకశ్రమల మానసిక సంక్షోభాల సంకీర్ణ మహాటవీ!

నా మొత్తం శరీరాన్ని రెండు చేతులుగా మార్చి

నమస్కరిస్తున్నాను తల్లీ!

సమస్త ప్రపంచాన్నీ నీ అరచేతుల్లోకి తీసుకుని చాచి

ఒక్కలెంపకాయ కొట్టు తల్లీ —

అఖిల పురుష ప్రపంచాన్ని నీలో తన వికృతపుటాకారాన్ని

దర్శించనీ — దర్శించనీ.

## మల్టీనేషనల్ ముద్దు - కొండేపూడి నిర్మల

పసుపూ గంధం పన్నీటి మడుగుల్లో దూకిన
వెనకటి తరం శారీరక స్పృహకంటే
అందాల వ్యాపారం కోసం అందవిహీనమవుతున్న
వ్యవస్థకి బానిసగా
ఈ సామాజిక స్పృహ నన్నెక్కువ దగా చేస్తోంది

దేశాలమధ్య శత్రువ్యూహాల్ని
శవాలు లెక్కతేలుస్తాయి
దేశాల మధ్య వ్యాపార సంబంధాలు అంకెల్తోసహా దొరుకుతాయి
అక్కాతమ్ముళ్ళమధ్య
ఇప్పుడు రక్త సంబంధం ఒక వలస రాగ సంబంధం, ఒక వెట్టి

పంటెవరు దోచుకున్నాసరే
బీడు వదలని రైతొక గాడిద
ఫలమెవరి పేరిట చెలామణి అవుతున్నా సరే
పురిటి నొప్పి తీస్తున్న తల్లొక గాడిద
పదమెవరు దోచుకున్నాసరే
పాటమానని గాయకుడొక గాడిద గాడిద
కన్నీళ్ళమీద పరిశోధన జరక్కపోవచ్చు
వెనక కాళ్ళ వడ్డింపులుంటాయని రుజువులున్నాయి.

## పడిగాపులు - కౌముది

బిడ్డా!

చానాదినాలయింది

కండ్లల్లో కన్పిత్తానవు

నిన్ను సూడాలని మనసంతా పీకుతంది

ఏ పని చేద్దామన్నా మనసు సుదురాయించడంలేదు

అప్పుడా ఇప్పుడా నాలుగైదేండ్లయింది

నిన్ను సూడకుంట ఒక గడియ కూడా ఎప్పుడుండలే

కూలికిపోయినా నాలికి పోయినా

కొడుకు ఏమయ్యిండోనని ఆదరబాదరగా ఇంటికచ్చేదాన్ని

నిన్ను చూడంగనే చేసినకట్టం మర్సిపొయ్యి మనసంత నిమ్మలమయ్యేది

పాలుపెరుగు పరమాన్నాలు తినిపించి నిన్ను పెంచకపోవచ్చు

నాపానం పోసి కడుపంటకట్టుకోని నిన్ను పెంచుకున్న

పుట్టెడుబుద్ధులున్నోనివి

మా కట్టం సుఖం ఇస్తారిత్తవనుకున్న

మా కాల్లు రెక్కలు దగ్గరవడుతే యింత గంజిపోత్తవనుకున్న

మేం చస్తే

మా బొందలల్ల ఇంత మన్నేసి మా దినవారాలు జేత్తవనుకున్న

మమ్ముల ఆగంజేసి అడివిల కలుస్తవనుకోలే

కొడుకా కొడుకా అని కంటికంటికి పుట్టెడేడుస్తాన్న

తల్లీపిల్లల్ని ఏరుజేసినోల్లకు నా ఉసురుతల్లకపోదు

నువ్ ఇల్లిడిసిన దగ్గర్నుంచి

పోలీసుల దూం ధాం చూడాలే

మీ అయ్యను పట్టుకపోయి చావచావగొట్టిండ్లు

తమ్మున్ని పట్టుకపొయ్యి జైల్లబెట్టిండ్లు

నన్నయితే ముసల్దనైనా చూడకుంట ఎక్కడబడితే అక్కడగొట్టిండ్లు

వాల్లు కొట్టిన దెబ్బలకు సక్కగ ఊపిరి తియనిత్తలేదు

'నీ కొడుకును ఎక్కడకి పంపినవే లంజ' అని

నోటికి ఎంతత్తె అంత తిట్టిండ్లు

వాళ్ల నోళ్లల్ల పురుగులు వడ

నా అసొంటి తల్లి వాళ్లకు లేదేమో

నీతీని సోపతి జేసినోళ్లను పట్టుకపొయ్యి కాల్చిసంపిండ్రు

వొయసొయిసు పోరగాండ్లు ఎవ్వలు ఊర్లుంటలేరు.

ఊరు ఊరంత ఇడిసిపెట్టిన ఇల్లోతుగున్నది

మన ఊరేగాదు ఈడ ఏ వూరు సక్కగలేదు

పండగల్లేవు పబ్బాల్లేవు

పానాలు అరిసేతుల పెట్టుక బరుకుడైతాంది

నీవెట్ల బతుకుతానవో నాకైతే తెల్వదు

అసలు నువ్ చచ్చినవో బతికినవో తెల్వకుంటున్నది

బతికుంటే మాత్రం యాదిపెట్టుకో

'కాన్రాని కొడుకు కోసం

కండ్లల్ల ఊపిరిపోసుకోని

ఈ అవ్వ ఎదురుసూత్తాంద'ని

## కలల ప్రియదర్శిని

- జాన్ హైడ్ కనుమూరి

నిదురించిన రాత్రిలో కల కన్నట్టు
కనురెప్పల్లో కదుల్తున్న దృశ్యాలు
రెప్పతెరిచిన వేళ కళ్ళముందులేనట్టు
వాస్తవ అవాస్తవాల నడుమ
కొట్టుమిట్టాడుతున్న మనసు
బద్దలు కొట్టి
"నిన్ను ప్రేమిస్తున్నానని" చెప్పాలి

మరియ ఎంచుకున్నది ఉత్తమమా?
మార్త ఎంచుకున్నది ఉత్తమమా?
న్యాయవాది యేసై వెలువరించినతీర్పు

తీర్పు తీర్పువెనుక దాగిన నిజాలను
వెలికి తీయడాన్కి నేనెవరు?

ఎంచుకున్న మార్గాల ఆలోచనల్లో
పరుగెడుతూ పరుగెడుతూ
విజయమెవరిది?

కలలు గానంచేస్తూ
అక్షరాలద్దిన రథాన్నధిరోహించి
సమరాంగణమై కదుల్తున్న ఈమె ఎవరు?

ఓ భారతనారీ! సహోదరీ!
తల్లిగర్భంలో నిన్నెరిగినవాడు
తానే తల్లి గర్భంలోకి మారినప్పుడు
శిశువై కొనియాడబడ్డాడా?
పశుల పాకలోకిచేరి తృణీకరింప బడ్డాడా?

ఆదినుంచి
వర్గ వర్గాలుగా విభజింపబడ్డ భూమిపై
నీ శ్వాస కేర్ మన్నప్పుడే
అవమానం కొండచిలువై
మింగాలని ప్రయత్నిస్తోంది
మింగలేనప్పుడు
అశపపండదో తినేటట్టు చేస్తుంది

నడుస్తున్న దేహం వెనుక
నీడలా వెంటాడుతుంది

కళ్ళను పొడిచి కలలను చిదిమి
నిమ్మరసాన్ని పిండినట్టు
జీవితాన్ని పిండేస్తుంది

మంచుపొగలను చీల్చుకొస్తున్న
సూర్యకిరణాలల్లోంచి
నీ సాన్నిహిత్యం గోర్వెచ్చగా తాకుతూనేవుంది

జీవనపోరాటాల రణరంగంలో
నడచిపోయిన అడుగులకోసం
అన్వేషిస్తున్నా
ఊరు వాడల్లోనో
రాజవీధుల్లోనో
జాడలకోసం వెదుకుతున్నా

నా నగర వాసులారా!
జీవనశ్రమలోపడి నే నిద్రిస్తున్న వేళ
అలికిడిలేకుండానే
నడిచివెళ్ళిన నా సోదరిని చూసారా!

నా సోదరి ధీశాలి!
పోరాట పటిమల యోద్ధ

అక్షర రాపిడి వెలిగించిన దివ్వె
తండ్రిచేసిన వ్యవసాయంలో
పాదుగా ఎగబాకిన ద్రాక్షతీగ

బహుశ
బంగారువీధుల్లోకి వెళ్ళిపోయిందేమో!

నా నగర వాసులారా!
సోదరి ఎదురైతే
సోదరుడు ఒంటరి ఆలోచన్తో
వీధుల్లో తిరుగాడుతున్నాడని చెప్తరా!

ఇక్కడింకా పాఠశాలలు నెలకొల్పాలి
దర్పణం మార్చాలి!
కొత్త ఆలోచనై బోధించాలి!
పోరాటాక్షరాలు తెలియని
నిశానులున్నారిక్కడని చెబుతారా!
ఇక్కడింకా
మురికి పట్టిన సందులు, వీధులు వున్నాయి
శుభ్రపరిచే పోరాటానికి
కొత్త ఆయుధాన్ని తయారుచేయాలి

23. 1. 2007

## ప్రజాస్వామ్యం - హెరాల్డ్ పింటర్



తప్పించుకునేందుకు దారిలేదిప్పుడు
పెద్ద పోటుగాండ్లు బయటకి వస్తున్నారిప్పుడు
కనిపించిదల్లా దోచుకుంటారిప్పుడు
వెనకముందు చూసినడవాలిప్పుడు

‘మహా ’ శ్వేతా దేవి

- పి. సత్యవతి



‘శిశు’ వంటి అత్యుత్తమ కథ వ్రాయలన్నా. ‘హజార్ చౌరాసి కా మా’ ‘అరణ్యేర్ అధికార్’ వంటి గొప్పనవలలు వ్రాయాలన్నా, ద్రోపది, శనీచరి వంటి గొప్ప నవలలు వ్రాయాలన్నా - సంబంధిత ప్రజలతో పరిచయం - వారి పట్ల సానుభూతి వుండడం ఒక్కటే చాలదు. వారితో ఆత్మీయ సంబంధం వుండాలి - ఆత్మక సంబంధం వుండాలి.- అటువంటి సంబంధం ఏర్పరుచుకోవడం రచనతో పాటు క్రియాశీలిగా వుండడం రచయితలందరికీ సాధ్యం కాదు. వీటన్నింటినీ సాధ్యం చేసుకోగలిగిన విశిష్ట రచయిత మహాశ్వేతా దేవి. ఆశయాలకీ ఆచరణకీ మధ్య అంతరాన్ని పూడ్చి వేయగల రచయిత్రి. ‘పది, విత్తనాలు’ వంటి కథలో ఆమె నాకు పరిచయం. ఆమె పరిశీలన, అవగాహన, విశ్లేషణ నైపుణ్యానికి నేను అబ్బురపడి ఆమె అభిమానిగా మారింది. ‘శిశు’ అనే కథ చదివాక, ఆ కథ నన్ను వెంటాడి – వేధించి బాధించింది. అక్షరాస్యత లేకపోవడం, అజ్ఞానం, మూఢ నమ్మకాలు, దయలేని ప్రకృతి, నేరస్థులుగా ముద్రవేయబడడం - ఒకటేమిటి, వారి జీవితం సమస్యల మయం - వారే ఆదివాసులు - ఆదివాసి జీవిత సంక్లిష్టతని మహాశ్వేతాదేవి తెలుసుకున్నట్లు ఎవరూ తెలుసుకోలేదేమో అనిపిస్తుంది.

వ్రాయడమే కాదు – ఆమె వారి అభివృద్ధి కోసం; వారి సంక్షేమం కోసం ఇప్పటికీ పనిచేస్తూన్నారు. వారితో మమేకమైపోయారు. ఎంతగా వారు ఆమెని తమలో కలుపుకున్నారంటే, (మాకీ సాడి) తల్లి చీరె ఆమెకిచ్చి వారు సత్కరించారు. ఈ చీరెని ఆదివాసీ అమ్మాయిల పెళ్ళిళ్ళల్లో వధువు తల్లికి యిస్తారు.

ఇది అందుకోవడం తన బాధ్యతని పెంచిందనీ – వారి అభివృద్ధికి యింకా చాలా చెయ్యాలని ఆవిడ అన్నారు. సాహిత్య అకాడమీ, జ్ఞానపీఠ, మెగసెస్సే – ఈ అవార్డులన్నింటికన్నా ఆమెని ఈ తల్లి చీరె ఎక్కవ సంతోషపెట్టింది.

ఇంతటి రచనా నైపుణ్యం – క్రియాశీలత, ఆమెకి అలవడటానికి కారణం లేకపోలేదు. ఆమె వ్యక్తిగా ఎదుగుతున్న కాలంలో భారతదేశంలో జరిగిన అనేక కీలకమైన సంఘటనలే అందుకు కారణం. 1926లో జన్మించిన మహాశ్వేతా దేవి పట్టభద్రురాలయ్యేనాటికి దేశంలో స్వాతంత్ర సమరం పతాక సన్నివేశంలో వుంది. ‘తేభాగ’ ఉద్యమం ఊపందుకుంటున్నది. మతకలహాలు – బెంగాల్ కరువు – వీటన్నిటినీ చూడడమే కాదు – వాటికి సంబంధించిన అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు కూడా.

అరవైయ్యో దశకం చివర్లో జరిగిన రైలు ఉద్యమాల గురించి వ్రాశారు. తరువాత వచ్చిన ' వసంత కాల మేఘ గర్జన' యువమేధావులనెంతమందినో ఆకర్షించింది. అనేకమంది యువతీ యువకులు కళాశాలలు / యూనివర్సిటీలు వదిలి ఉద్యమంలో చేరారు. అయితే ప్రభుత్వం ఆ ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసింది. అనేక మంది కార్యకర్తలు ఉద్యమంలో ప్రత్యక్ష పరోక్ష సంబంధం వున్న వారు జైలుపాలయారు. ఉత్సాహ, ఉద్రిక్త, ఉద్విగ్న భరితమైన ఈ కాలంలోనే ఆమె 'హజార్ చౌరాసికా మా' ( 1084 నెంబరు వ్యక్తి తల్లి ) నవల వ్రాశారు.

అయితే 'అరణ్యేర్ అధికార్ ' నవల వ్రాసి సాహిత్య అకాడమీ అవార్డు పొందిన తరువాతే ఆమె భారతదేశంలో చాలామందికి తెలిశారు. రాంచీకి దక్షిణాన ఉన్న అరణ్య ప్రాంతాలలోని ముండా తెగల ప్రజలు – బిర్సా ముండా నాయకత్వాన బ్రిటిష్ అధికారులతోనూ, మిషనరీస్ తోను, స్థానిక భూస్వాములతోనూ సల్పిన పోరుని ఈ నవల చాలా శక్తివంతంగా చిత్రించింది. ముండా పేరుతో ఒక అవార్డు నెలకొల్పి, దానిని 'రాజీవ్ గాంధి' కి యివ్వడం జరిగింది. మహాశ్వేతా దేవి ముఖ్యదృష్టి అంతా పీడిత ఆదివాసీ, దళిత బహు జనులగురించే – వారి జీవితంలోని భయంకరమైన దోపిడీ గురించే. ఆదివాసీ జీవితాలలో వుండే అన్ని 'షేడ్స్ ' ని ఆవిడ చూపగలిగారు. హజార్ చౌరాసియా ఎంత గొప్ప నవలో 'ద్రౌపది' కూడా అంత మంచి కథ. రాజ్యహింస స్త్రీల పట్ల ఎంత వికృతంగా క్రూరంగా వుంటుందో చూపించిన కథ. 'శిశు' అనే కథ నన్నెందుకు అంతగా వెంటాడుతుందో చెప్పడం అవసరం.

ఇది 'లోహ్రి' అనే ప్రదేశంలో జరిగినట్లు చెప్పే కథ. బొత్తిగా 'చెలమ' యింకిపోయిన చోటు. చెట్లన్నా ముడుచుకుని కుంచించుకుని పోయాయిక్కడ. మనుషులు చెట్లవలెనే ఎండిపోయి వుంటారు. మట్టి నెత్తురు రంగులో వుంటుంది. క్షమ పీడితులైన ఇక్కడి ప్రజలు అర్ధనగ్నంగా, కళ్ళు పీక్కుపోయి, పొట్టలు వుబ్బిపోయి వికృతంగా వుంటారు. అక్కడ పంటలు పండవు. వ్యవసాయం చేసుకోవడానికి ప్రభుత్వం నేల, పనిముట్లు యిచ్చినా, అక్కడి ప్రజలు వాటిని అమ్ముకుంటారే గానీ, వ్యవసాయం జోలికి పోరు. ప్రభుత్వం ఏటా వారికి కరువు రిలీఫ్ క్రింద ఆహార్య ధాన్యాలు వగైరాలు ఒక ఆఫీసర్ ద్వారా పంపిణీ చేస్తుంది. అలాంటి రిలీఫ్ క్యాంప్ కి ఆఫీసర్ గా నిజాయితీ పరుడని పేరు తెచ్చుకున్న 'సింగ్ ' వస్తాడు. అక్కడి ప్రజల్ని గురించి, 'లోహ్రి' గురించిన కథల్లోనూ, గాధల్లోనూ సింగ్ ని తక్కిన అధికార్లు భయపెడతారు. అసలు నివాస యోగ్యం కాని ప్రదేశం అని చెప్తారు. ఏమైనా అక్కడి వాళ్ళకి మేలు చెయ్యాలని సంకల్పించుకుంటాడతను.

'లోహ్రి' గురించిన ఒక స్థల పురాణం గూడా అతనికి తెలుస్తుంది. ఇక్కడ ఇనప ఖనిజం బాగా లభించేది. ప్రజలు దాన్ని తవ్వి తీసి ఇనప పనిముట్లు చేసేవారు. వాళ్ళంతా 'ఆగరియా' తెగకు చెందినవాళ్ళు. 'ఆగరియా' తెగ వాళ్ళంతా 'అసుర' జాతికి చెందిన వాళ్ళట. అంటే రాక్షసులన్నా మాట. వాళ్ళు అగ్నిని సేవించి అగ్ని

వదిలి స్నానం చేసేవాళ్ళట. వాళ్ళ రాజు ‘లోగుండి’. ఇతనికి పదకొండుమంది సోదరులు. ఈ పన్నెండుమందికీ ఒక భార్య. భూమి లోపల వుండే అసురులు వీళ్ళని మాత్రమే ఇనుప ఖనిజం తవ్వుకోనిచ్చేవారు. ‘లోగుండి’ పరమ అహంభావి. తను సూర్యుడిన్నా శక్తిమంతుడ్నని విర్రవీగే వాడు.

సూర్యుడికి కోపం వచ్చి లోగుండినీ అతని తమ్ముళ్ళనీ రాజ్యాన్నీ కాల్చి బూడిద చేశాడు. ఆ సమయంలో అక్కడ లేనందున రాణి గారు బ్రతికిపోయారు. అయినా సూర్యశక్తి ఆమె శరీరాన్ని దహిస్తుంటే భరించలేక ఒక పశువుల కాపరి యింటికి పరిగెత్తి వాళ్ళ మజ్జిగ కుండలోకి దూకి శరీర తాపాన్ని తగ్గించుకుంది. అక్కడే ఒక చెట్టు క్రింద ‘లోగుండి’ కి వారసున్ని కన్నది. అతడే జ్వాలాముఖి. అతడు నోరు తెరిస్తే అగ్ని కురిసేది. అతడు పెద్దవాడై సూర్యుడితో యుద్ధానికి దిగాడు. అప్పుడు ఉద్భవించిన వేడి – లోహ్రిభూమిని దగ్ధం చేసింది. జ్వాలాముఖి సూర్యుడికి శాపం పెట్టాడు. నువ్వు నీ భార్యతో నెలకొక్కసారే సుఖంగా వుండగలవని. సూర్యుడు మాత్రం తక్కువ వాడా – వెంటనే జ్వాలాముఖికి కూడా శాపం యిచ్చేశాడు. “ మీ అగరియా తెగవారు గొప్ప నైపుణ్యం కలవారే కావచ్చు. కానీ మీ సంపాదనంతా బూడిదై గాలికెగిరిపోతుంది” అన్నాడు. ఇప్పుడిక వాళ్ళు కులవృత్తిని పోగొట్టుకున్నారు. వాళ్ళిప్పుడు జ్వాలాముఖి ఓటమికి సంతాపం తెలుపుతున్నారు. అందుకోసం వ్యవసాయం చెయ్యరు. ఇనుప గనిని కాపలా కాసే లోహాసురుడు వాళ్ళకి ఇనుము యివ్వడు. బొగ్గుగనికి కాపలాగా వుండే ‘కోయిలాసుర’ వాళ్ళని బొగ్గు తవ్వనివ్వడు. అగ్నికి కాపలాగ వుండే ‘అగియాసుర్ ‘ వాళ్ళకి అగ్ని యివ్వడు. కానీ ఎప్పటికైనా వాళ్ళు శాపవిముక్తులు కాగలరని మంచి రోజులొస్తాయని నమ్ముతారు. సింగ్ అక్కడికి వచ్చే నాటికి పధ్నాలుగేళ్ళ క్రిందట – భారత ప్రభుత్వం ‘లోహ్రి’ లోని ఇనుప గనులను గురించి తెలుసుకోవడానికి ఒక భూగర్భ శాస్త్రజ్ఞులు బృందాన్ని పంపింది. ‘కువ’ గ్రామంలో అగరియా తెగవాళ్ళు ఇందుకు అభ్యంతరం చెప్పారు. ఈ ప్రాంతపు పవిత్రతని పరాయి వాళ్లొచ్చి చెడగొట్టడాన్ని లోహాసుర, కోయిలాసుర, అగియాసుర్ అంగీకరించరన్నారు. కానీ ఈ బృందం డైనమైట్ తో అక్కడ కొండ ప్రాంతాన్ని పేల్చింది. దాంతో ఉగ్రులయిన కువ గ్రామపు అగరియాలు – ఈ బృంద సభ్యులందరినీ నరికి పారిపోయారు. దాదాపు వంద, నూటయాభై మంది అడవికి అదృశ్యమైపోయారు. ప్రభుత్వం వారి కోసం విపరీతంగా గాలించింది. నెలరోజుల తర్వాత పోలీసులు ‘కువ’ గ్రామానికి నిప్పు పెట్టారు. అయినా కసి తీరక అక్కడ భూమిలో ఏమీ మొలకెత్తకూడదనే ఉద్దేశ్యంతో భూమిలో ఉప్పు చల్లిపోయారు. మిగిలిన అగరియా జాతుల మీద కూడా కక్ష సాధించారు. కానీ పారిపోయిన వారు దొరకలేదు. ప్రభుత్వం ఏటా పంపుతున్న తిండి గింజలు ఎవరో దొంగలిస్తున్నారు. దొంగిలించే వాళ్ళు పెద్ద వాళ్ళు కారు. వాళ్ళు చిన్న పిల్లలు. వాళ్ళు మానవసంతతి వాళ్ళు కాదు. ఎంతకాపలా కాసినా దొంగతనం జరుగుతూనే వుంది. ఈ దొంగతనాలు ఏ పిల్లలూ చేయడం లేదనీ, ఇక్కడి

ప్రజలే అమ్ముకుంటున్నారని ఒక వాదన. ఈ వివారాలనీ బి.డి.వో సింగ్ కి చెప్పి – ఒక భయంకరమైన వాతావరణాన్ని ఎదుర్కోడానికి అతన్ని మానసికంగా సన్నద్ధం చేస్తాడు.

ఆదివాసీలంటే వేణువు వూదుకుంటూ చెట్ల వెంటా కొండల వెంటా తిరుగుతారనీ, స్త్రీలు తలలో రంగు రంగుల పూలు తురుముకుని నృత్యం చేస్తూ పాడుతూ వుంటారనీ హిందీ వ్యాపార సినిమాలు చూసి వూహించుకున్న సింగ్ ఇక్కడి ఆదివాసీలని చూసి విస్మయం చెందుతాడు. వాళ్ళు పాడతారు కానీ ఏడుపిల్లా వుంటాయి ఆ పాటలు. ఇంక వాళ్ళ ఏడుపు ఎలా వుంటుందో. ఈసారి రిలీఫ్ క్యాంప్ భారీ ఎత్తున వుంది. ఎప్పటికన్నా ఎక్కువ ఆహార పదార్థాలున్నాయి. వాటిని జాగ్రత్తగా కావలి వేసి అర్హులకి అందించాలి. ఇక్కడి ప్రజల చేత తిరిగి వ్యవసాయం చేయించాలి. ఇట్లు ప్రభుత్వం ఇచ్చే తౌరిపెంతో కాక వాళ్ళంతట వాళ్ళు సంపాందించుకునేలా చెయ్యాలని చాలా నిజాయితీతో అనుకుంటాడు సింగ. అతనికి సాయంగా ఓ పదిమంది అగరియా యువకులుంటారు. వాళ్ళు సింగ్ ని అమితంగా గౌరవిస్తూ, సాయం చేస్తూ వుంటారు.

ఒక రాత్రి దొంగలు రానే వచ్చారు. చిన్న చిన్న చేతులు బియ్యం – పప్పు సంచులు ఎత్తుకు పోతున్నాయి. సింగ్ కి మెలుకువ వచ్చి చూస్తే – అగరియా యువకులు టెంట్ ని మళ్ళీ బిగిస్తూ కనిపించారు. "అంటే వీళ్ళేనా దొంగలకి సాయం చేసేది. ఎంత ద్రోహం? అయినా దొంగల్ని పట్టుకు తీరాలనే పట్టుదలతో సింగ్ వాళ్ల వెంట అడవికి పడ్డాడు. పరిగెత్తాడు. దొంగలు కూడా పరిగెత్తి అలసిపోయి దాన్యం సంచులు ఒకచోట వుంచి, వాటి చూట్టూ రక్షణ వలయంగా నిలబడ్డారు. సింగ్ వారిని సమీపించాడు. వాళ్ళు దాన్యం సంచులు వదిలి సింగ్ చుట్టూ నిలబడ్డారు, అతని బయటికి పోనీయకుండా. ఇంక అతను వారినించీ తప్పించుకోలేడు. అప్పుడతనికి వాళ్ళ ఆకారాలు స్పష్టంగా కనపడ్డాయి. వాళ్ళంతా నగ్నంగా వున్నారు. వాళ్ళకి పొడవాటి జుత్తు వుంది. అందులో ఒకడి జుత్తు సాంతం నెరిసిపోయింది. ఆడపిల్లలకి ఎండిపోయి వేలాడే రొమ్ములు! జుత్తు నెరిసిన వాడు సింగ్ కి మరింత దగ్గరగా వచ్చాడు. ఎండిపోయి కుంగిపోయి వేలాడే తన అవయువాన్ని సింగ్ కి చూపిస్తున్నాడు.

వీళ్ళెవరూ పిల్లలు కారు. పెద్దవాళ్ళే. వున్నట్టుండి వాళ్ళు "మేం పిల్లలం కాము. మేం కువ గ్రామానికి చెందిన అగరియాలం." అంటూ పిచ్చిగా అరవడం మొదలు పెట్టారు.

"మేం వాళ్ళని నరికివేసి పారిపోయొచ్చాం. మమ్మల్ని పోలీసులు, సైన్యం – ఎవరూ పట్టుకోలేరు. మాకు మా అగరియాలే సాయం చేస్తారు. పస్తులుండి కృంగి కృశించి చాలా మంది చనిపోయారు. మేం పధ్నాలుగుమందిమే బ్రతికి వున్నాం."

"దగ్గరకి రాకండి" అని గొణిగాడు సింగ్ . అతని తల తిరిగిపోతోంది.
వాళ్ళు మరింత దగ్గరగా వచ్చి వాళ్ళ అవయవాల్ని సింగ్ కి తాకిస్తున్నారు.

'మేం పురుషులం. వంధ్యులం – మా స్త్రీలు, గొడ్రాళ్ళు, మేం మళ్ళీ మామూలు మనుషుల సైజుకి పెరగాలి. అందుకే ఆహారం దొంగలిస్తున్నాం.'

వాళ్ళు చెప్పిందే నిజమైతే ఇదేం నాగరికత . దేశం బాగు కోసం రచించే ఈ ప్రణాళికల ప్రయోజనం ఏమిటి? అనుకున్నాడు సింగ్ . వాళ్ళు అయిదడుగుల తొమ్మిందంగుళాల దేహాన్ని వాళ్ళు ద్వేషిస్తున్నారు. తన శరీరపు సహజమైన ఎదుగుదలని వాళ్ళు ద్వేషిస్తున్నారు. సింగ్ కి అర్థం అయింది. తనకి తానే ఇప్పుడు మరణ శిక్ష విధించుకున్నాడు. ఈ అగరియాల క్షీణదశకి కారణమయ్యే వారిలో తానూ ఒకడే. సింగ్ కి గొంతు పెగలలేదు. అతని కన్నీళ్ళు ధారలు కట్టాయి.
ఈ కథ చదివాక మహాశ్వేత కథలు ఒక్కటి కూడా విడిచి పెట్టకుండా చదవకపోతే మనలో ఏదో లోపం వున్నట్లే అనిపించింది.

వర్గ కుల అణచివేతలతో పాటు స్త్రీలపై అంతర్లీనంగా సాగే అణచివేతను కూడా ఆమె తన కథల్లో చూపిస్తారు. శనీచరి, గిరిబాల, రుడాలీ వంటి కథలు అలాంటివే. కందమూలాలు లేని - సరైన బట్టలు లేకుండా పల్లెటూళ్ళలో బ్రతికే ఆదివాసీ స్త్రీలని కలకత్తాలో ఇటుక ఆముళ్ళ పని యిప్పించి మంచి జీవితం యిప్పిస్తామని భ్రమపెట్టి వాళ్ళని వేశ్యావృత్తిలో దింపే గోధుమ త్రాచుల్లాంటి వాళ్ళు – వాళ్ళని నమ్మే అమాయక యువతులు – తిరిగి ఇంటికి చేరితే వాళ్ళని ఇంటి వారు వెలివేయడం. ఇది ఒక శనీచరి కథే కాదు. చాలా మంది 'శనీచరి' ల కథ.

ఈ కథని ఇలా ముగుస్తుంది రచయిత్రి –
'ఎంత కాలం అయితే పుట్టిన గడ్డ శనీచరికి తిండీ గుడ్డా యివ్వదో - అంత కాలం దాకా శనీచరి తన చేతిని ఆడిస్తూ చూపుడువేలుని చూపిస్తున్న నిశ్చల చిత్రం మన కళ్ళెదుట వుంటూనే వుంటుంది. '
మహాశ్వేతా దేవి సృష్టించిన మరో శనీచరి బ్రతుకు తెరువు కోసం చనిపోయిన వారి కోసం ఏడవడం అలవాటు చేసుకుని 'రుడాలి' గా మారిపోయింది.

ఇంకా చాలా మంది స్త్రీలు పురుషులతో పాటు అన్ని రకాల పీడనలని ఎదుర్కొంటూ అదనంగా పురుష పెత్తనాన్ని ఎదుర్కొంటారు. బెంగాలీ భాషలోని అన్ని రకాల యాసల్ని మహాశ్వేత చాలా బాగా తన రచనల్లో ఉపయోగిస్తారు. జీవితంలో అన్ని వర్ణాలనీ అన్ని ఛాయల్ని పట్టుకుంటారు.

వాసిలోనే కాక రాసిలోనూ ఎక్కువైన మహాశ్వేత దాదాపు వంద పుస్తకాలు వ్రాశారు. వాటన్నింటినీ ఉదహరించలేము. కనుక కొన్నింటిని మాత్రమే ప్రస్తావించటం కుదిరింది.

దాదాపు డజనుకు పైగా ఆదివాసీ సంక్షేమ సంఘాలలో సంబంధం వున్న ఈమె, తన డెభై నాలుగో ఏట – ఆరోగ్యం సరిగ్గా లేని పరిస్థితుల్లో కూడా డీనోటిఫైడ్ గిరిజన తెగల సామాజిక ఆర్థిక అభివృద్ధిని గూర్చి తీవ్రంగా పరిశోధిస్తున్నారు. వెనుకబడిన పురూరియా వంటి ప్రాంత గిరిజనుల అభివృద్ధికి పాటుపడుతున్నారు.

బిర్సాముండా వీరోచిత పోరాటం గురించి నవల వ్రాసినట్లే మన్యం పోరాటం గురించి కూడా నవల వ్రాయాలని అనుకుంటున్నారు.

మాటకీ - చేతకీ; ఆశయానికీ ఆచరణకీ వంతెన కట్టగలిగిన రచయితని అభిమానించడంలో ఆశ్చర్యం లేదు. ఆమె గురించి మరింత తెలుసుకోలేకపోతేనే ఆశ్చర్యం.

# అంతర్జాతీయ మహిళా దినం

- రంగనాయకమ్మ

క్లారాజెట్కిన్ వంటి కమ్యూనిష్టులు 1910లో దీన్ని ప్రతిపాదించినప్పుడు, 'అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం' అన్నారు. శ్రామిక మహిళలకు పని పరిస్థితుల్లో హక్కుల గురించీ, సోషలిస్టు పోరాటాల గురుంచీ, స్పృహ కలిగించాలనే దృష్టితో, కానీ క్రమంగా దీన్ని బూర్జువా ప్రభుత్వాలన్నీ, 'శ్రామిక మహిళా దినం' లో నించి 'శ్రామిక' ని తీసివేసి, 'అంతర్జాతీయ మహిళా దినం' గా మార్చాయి. అన్ని ఉత్సవాల్లాగే ఈ 'ఉత్సవం' కూడా ఏటా సభలు, సెమినార్లూ, సన్మానాలూ వంటి వాటితో కేవలం 'తంతు' లాగా, 'కర్మకాండ' లాగా జరిగిపోతూ వుంటుంది. ఎన్ని ఏళ్ళు గడచినా ఈ 'దినోత్సవాల' వల్ల మహిళలు నేర్చుకునే జ్ఞానమూ లేదు; సాధించే హక్కులూ లేవు. ఈ మహిళా దినాలు అప్పుడప్పుడూ చిట్టి పొట్టి సంస్కరణల్ని మాత్రమే ప్రతిపాదిస్తూ వుంటాయి.

'సంస్కరణల్ని' వ్యతిరేకించ నక్కర లేదు. కానీ ఆ సంస్కరణలు అయినా నిజంగా జరగవు. వాటి వల్ల, మహిళలకు నిజంగా ఒరిగేదేమీ వుండదు. ఉదాహరణకి, 'స్త్రీలకి ఆస్తి హక్కు' అంటారు. కానీ , 'ఆస్తి' ఎంత జనాభాకి వుంది? ఆస్తి హక్కు నిజంగా అమలు జరిగితే, అది, ఆస్తితో పులిసివుండే కుటుంబాల్లో మహిళలకు ఒక హక్కుని ఇస్తే ఇవ్వవచ్చు. దాని వల్ల, శ్రామిక మహిళలకు ఒరిగేదేముంటుంది? శ్రామిక కుటుంబాల్లో పరిశుభ్రమైన మంచి నీళ్ళు తాగగలిగే పరిస్థితి కూడా వుండదు. స్త్రీలకు స్థిరమైన వుద్యోగాలూ స్వంత ఆదాయాలూ వుండవు. అక్షర జ్ఞానమే వుండదు. భార్య భర్తలు కనీసపు సంతోషంతో గడపడానికి కావలసిన ఇంటి సదుపాయాలేవీ వుండవు. 'అది లేదు ఇది లేదు' అనే మాట తప్ప, 'ఉన్నది' ఏదీ ఉండదు. అలాంటి బికారి మహిళలు ఆస్తి హక్కుల్ని ఏం చేసుకుంటారు?

ఆ మహిళలు, యూనివర్శిటీల్లో చదివే హక్కుల్ని ఏం చేసుకుంటారు? విమానాల్ని ఎక్కే హక్కుల్ని ఏం చేసుకుంటారు? అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్ని ఏం చేసుకుంటారు? బికారి జీవితాలకు ఏది మూలమో, దానితో పోరాడడానికి ఏది మార్గమో చూపించని ఏ దినోత్సవాలైనా జనాలకు ఎంత ఉపయోగమో, ఈ దినోత్సవం కూడా అంత ఉపయోగం!

[ ఆంధ్రప్రభ వార పత్రిక, 8 - 3 - 1999]

## మన సమాజంలో ఇలా జరుగుతుందా? - ఉషా ఆరి

అమెరికా లో నివసిస్తున్న తెలుగు సమాజంలో గృహహింస ఉంటుందా ! అని చాలామంది నన్ను ప్రశ్నించారు. దానికి సమాధానం అవుననే చెప్పుకోవాలి. వాస్తవానికి గృహహింసకు గురైన స్త్రీల గురించి వినడమో, చూడడమో జరిగిందని మనలో చాలా మంది అంగీకరిస్తారు. కానీ దానిని కుటుంబ అంతర్గత వ్యవహారమని జమకడతారు. 2002 సంవత్సరంలో రాజ్ , సిల్వర్ మెన్ లు బోస్టన్ నగరంలో నివసించే 160 దక్షిణాసియా మహిళలతో గృహహింస పైన ఒక అధ్యయనాన్ని చేపట్టారు. ఈ అధ్యయనములో తేలిందేమంటే; 40.8% శాతం మహిళలు జీవితకాలంలో తమ భర్తల చేతిలో భౌతికంగా, లైంగికంగా హింసలకు గురి అవుతున్నారు.

గత సంవత్సరంలో దాదాపుగా 36.9 % మంది బాధితులయ్యారు. 29% శాతం మహిళలు దాడులలో గాయపడి వైద్యం కోసం హాస్పటల్ కూడా వెళ్ళారు. గృహహింస విషయంలో పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్లు, ప్రేమ పెళ్ళిళ్ల లో పెద్దగా తేడా ఏమీ కనిపించలేదు. 2004 సంవత్సరంలో న్యూ విజన్ సంస్థ చేపట్టిన వెబ్ సర్వే లో మిషిగన్ రాష్ట్రంలో నివసించే దక్షిణాసియా మహిళలలో 67% మంది, గృహహింస మన సమాజంలో జరుగుతున్నదని చెప్పారు. తెలుగు వాళ్ళు దీనికి ఏమాత్రం మినహాయింపు కాదు. గృహహింస, మహిళలపైన అత్యాచారాలను నిర్మూలించడం కోసం పనిచేసే దక్షిణాసియా మహిళా సంఘాలతో చాలా కాలం నేను పనిచేసాను. హింస పెట్టే భర్తలనుండి విడిపోవటానికి ప్రయత్నించిన ఎందరో తెలుగు మహిళలతో పనిచేసాను. రెండు సంవత్సరాల క్రితం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) వాళ్ళు తెలుగు వాళ్ళకి గృహహింస కు సంబంధించిన విషయాలలో సలహాలు ఇవ్వటానికి 'సోషల్ వర్క్ సర్వీసెస్ గ్రూప్ ' అనే సంస్థను ప్రారంభించారు. గృహహింసకు బాధితులైన నార్త్ అమెరికా తెలుగు మహిళలలో కొందరి అనుభవాలను ఈ వ్యాసంలో ప్రస్తావిసున్నాను. వ్యక్తిగత సమాచారాన్ని కాపాడడానికి గాను పేర్లు, స్థలాలు మార్పులు చేయడం జరిగింది.

సురేశ్ నాలుగు సంవత్సరాలుగా అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. పోయిన సంవత్సరం రెండు వారాల సెలవుపైన ఇండియాకి వెళ్ళాడు. అతని తల్లిదండ్రులు ఎన్నో పెళ్ళిసంబంధాలు వెతికి చివరికి లెక్చరర్గా పని చేస్తున్న సంధ్య అనే అమ్మాయిని ఎంపిక చేసారు. సురేశ్ ఆ అమ్మాయిని చూసి, మాట్లాడి ఒప్పుకున్నాడు. సంధ్య తల్లిదండ్రులతో పెళ్ళి చేసుకుంటానని చెప్పాడు. అమెరికా తిరిగొచ్చిన తర్వాత తెగ ఫోన్లలో మాట్లాడేవాడు. చాలా మర్యాదగా మాట్లాడుతూ, క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకునేవాడు. పెళ్ళి తర్వాత భవిష్యత్తు జీవితం గురించి ముచ్చట్లు పెట్టేవాడు. ఉద్యోగాన్ని వదిలి అమెరికా రావటానికి మనస్సు ఒప్పుతుందా

అని సంధ్యను అడిగేవాడు. తన అభిప్రాయాలను గౌరవిస్తున్నాడని సంధ్య చాలా ఆనందించింది. ఒక సంవత్సరం గడిచిన తర్వాత పెళ్ళి చేసుకొని భర్తతో సహా అమెరికా వచ్చింది. పెళ్ళైన కొత్తలో కొంతకాలం బాగానే వున్నాడు. తర్వాత మొదలైంది అసలు కథ. సురేశ్ భార్యను తిడుతూ బాధించేవాడు. చీటికి మాటికి అవమానిస్తూ, ఏమీ చేతకాదని వెక్కిరించేవాడు. అప్పుడు సంధ్య గర్భవతి, మొదటి బిడ్డ కోసం ఎదురుచూస్తున్నది . పరిస్థితి ఉధతమై తిట్టడం నుండి కొట్టడానికి తెగబడ్డాడు. గోడకేసి విసిరి కొట్టేవాడు. సంధ్యకు పరిచయమున్న స్నేహితులుగాని, బంధువులుగాని ఎవరూ లేరు. చాలా భయపడింది. సంసారజీవితాన్నిసక్కగా పెట్టుకోవటానికి సాధ్యమైనంతవరకు ప్రయత్నించింది. కానీ మొగుడు కోపం తో ఎప్పుడు రెచ్చిపోతాడో తెలియదు. ఆ.మె నిరంతరం భయం తో బతకేది. కడుపుతో వున్నప్పుడూ, బిడ్డ పుట్టిన తర్వాత కూడా భౌతిక దాడులకు పాల్పడుతునే వున్నాడు. ఇండియాలో వున్న తన అమ్మకి కూడా తన కష్టాలను చెప్పుకోలేక పోయింది సంధ్య. వాళ్ళ అమ్మ పెళ్ళి కోసం చాలా డబ్బు ఖర్చు పెట్టింది. కూతురి పైన ఎన్నో ఆశలు పెట్టుకుంది.

మొగుడు పెట్టే బాధలకు పసిబిడ్డ ఏమౌతాడోనని సంధ్య తల్లడిల్లేది. ఒకరోజు స్నేహితులు వాళ్ళింటికి భోజనానికని ఆహ్వానించారు. బయలుదేరడానికి పిల్లవాడిని ఆమె తయారు చేస్తుంటే, ఆలస్యమౌతున్నదని గొణగటం మొదలు పెట్టాడు. నోరు విప్పితే ఇంకే ప్రమాదం ముంచుకొస్తుందోనని, ఆమె మౌనంగా వున్నది. సమాధానం చెప్పలేదనే కోపంతో సురేశ్ మండిపడి సంధ్య ను కొట్టాడు. బాగా దెబ్బలు తగిలి కదలలేకపోయింది. భార్యను, బిడ్డను ఒదిలిపెట్టి సురేశ్ ఒక్కడే విందుకి వెళ్ళాడు. విందుకి ఒంటరిగా వచ్చిన సురేశ్ ని చూసి అతని స్నేహితుడి భార్య శంకించింది. ఎందుకంటే సురేశ్ తన భార్యను తిట్టటం స్వయంగా ఆమె విన్నది. మరునాడు విషయం ఏమిటో కనుక్కుందామని సంధ్యకు ఫోను చేసింది. బాగా దెబ్బలు తగిలి నీరసంగా వుండటంతో సంధ్య ఫోను లేపలేదు. స్పందన లేక పోవటంతో ఆమె కంగారుపడి సంధ్యను చూడటానికి ఇంటికి వెళ్ళింది. భర్త పెడుతున్న హింసకి, ప్రతి నిత్యం భయంతో బతుకుతున్నట్లు సంధ్య చెప్పింది. ఎప్పుడు ఏమీ జరుగుతుందో తెలియదు, ఎందుకు కోపంతో ఊగిపోయి కొడతాడో తెలియదు. అంతిమంగా సంధ్య చిత్రహింసలు పెడుతున్న తన భర్తను వదిలివేయటానికి నిర్ణయించుకుంది. ఆమె స్నేహితురాలు దగ్గర వివరాలు తెలుసుకొని, ఒక దక్షిణాసియా మహిళా సంఘం సహాయాన్ని కోరింది. ఆ సంఘం వాళ్ళు ఆమెకి ఆశ్రయం కల్పించి, జీవితాన్ని నిలబెట్టుకోవటానికి సహాయం చేసారు.

కవిత తన భర్తను ఇండియాలో కలుసుకుంది. ఆయన అమెరికాలో వున్న తన కంపెనీకి ఇండియాలో ఉద్యోగస్తులను ఎంపిక చేసుకునేవాడు. ఇద్దరూ ఇష్టపడి పెళ్ళి చేసుకున్నారు. మొదట్లో జీవితం బాగానే వుండేది. కొంతకాలం గడిచాక భర్తా అత్తా కట్నం సరిగ్గా తీసుకురాలేదని పోరు పెట్టటం మొదలు పెట్టారు.

ఆమెను భర్త తన స్వంత పెట్రోల్ బంకు లో పనిచేయమని అడిగాడు. అందుకు కవిత అంగీకరించి రోజుకి పదహారు గంటలు పనిచేసింది. జీతం డబ్బులు కూడా ఇవ్వలేదు. భర్త చాలాసార్లు తిట్టటం, కొట్టటం చేసేవాడు. కవిత మౌనంగా అంతా భరించింది. భర్త ఆమెను చెంపమీదకొట్టి, తన్ని చావాగొట్టేవాడు. ఇక భరించలేక ఇల్లు ఒదిలివెళ్ళిపోయింది. కవిత బయట ఉద్యోగం సంపాదించుకొని జీవితంలో స్థిరపడాలని ప్రయత్నించింది.

కొంతకాలం తర్వాత కవితను ఆమె మొగుడూ ,అత్తా కలసి మంచిగా మాట్లాడి కలసివుండమన్నారు. కవిత అందుకు అంగీకరించి మొగుడు ఇంటికి తిరిగి వచ్చింది. తర్వాత ఇండియాకు వెళ్ళుదామని అన్నారు. ముందుగా కవితా వాళ్ళ అత్తా బయలుదేరి వెళ్తే, కొన్ని వారాల తర్వాత భర్త వచ్చి కలుస్తానన్నాడు. కవిత తన తల్లిదండ్రులను కలుద్దామనే ఉత్సాహంతో వున్నది. ఆమె ఎప్పుడూ తన కష్టాలను తల్లిదండ్రులతో కానీ బంధువులతో కానీ చెప్పుకోలేదు. చెల్లెల్ల పెళ్ళి సంబంధాలు దెబ్బతినకూడదనే ఉద్దేశంతో మౌనంగా వున్నది. ఇండియా వస్తున్నట్లు తన తల్లిదండ్రులతో చెప్పవద్దని భర్త కవితను ఆదేశించారు. కవి తా వాళ్ళ అత్తా ఇండియా చేరుకున్న వారం రోజుల తర్వాత, కవిత తల్లిదండ్రులకు వాళ్ళ అత్త మామలనుండి ఒక ఫోను కాల్ వచ్చింది. దానిలో కవిత ఇండియా వచ్చినట్టు, హఠాత్తుగా గుండెపోటుతో మరణించినట్టు తెలియజేసారు. కవిత శరీరాన్ని దహనం చేసేసినట్టు చెప్పారు. కవిత తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురైయ్యారు. హఠాత్తుగా గుండెపోటుతో మరణించటం ఏమిటి? ఆదరబాదరగా దహనం చేయటం ఏమిటి? అన్నీ అనుమానాలే కానీ, కవిత తల్లిదండ్రులు కానీ అధికారులు కానీ ఏమీ చేయలేక పోయారు. అదేమంటే శవానికి దహన సంస్కారాలు చేసేశారు. అమెరికా లో వున్న కవిత భర్త మటుకు చట్టం నుండి తప్పించుకున్నాడు.

సృజన ఇండియాలో తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్ళి చేసుకుంది. ఒక సంవత్సరం తర్వాత భర్తతో కలసి అమెరికాకు వచ్చింది. కలసివున్న రెండు సంవత్సరాలలో భర్త ఆమెను 'అంత అందంగా వుండదని', 'నల్లగా వుంటుందని', 'ఆమెతో బయటకు వెళ్ళడం నామోషిగా వున్నదని' అంటూ గొడవచేస్తూ వుండేవాడు. పెళ్ళి చేసుకునేముందు చూసారు కదాని భర్తకు సృజన గుర్తుచేసింది. రూపం మార్చుకోవటం ఎలా సాధ్యమౌతుంది? పెళ్ళిచేసుకోమని ఎవరూ బలవంతపెట్టలేదు కదా అని అన్నది. సృజన గర్భవతి అయినప్పుడు, ఇండియాలోవున్న ఆమె తల్లిదండ్రుల వద్దకి పెళ్ళి అక్కడే పురుడుపోసుకోమని భర్త చెప్పాడు. ఇద్దరూ ఇండియా వెళ్ళారు. రెండు వారాలు గడిచిన తర్వాత ఆమెను తల్లిదండ్రుల వద్ద దిగబెట్టాడు. ఆమె పాస్ పోర్టు, రిటన్ టిక్కెటు అడిగితే, ఆయన తల్లిదండ్రుల వద్ద వున్నాయనీ తర్వాత పంపిస్తానీ చెప్పాడు. అలా అని చెప్పి అమెరికా తిరిగి వచ్చాడు. తర్వాత ఎప్పుడూ పెద్దగా సృజనతో మాట్లాడేవాడు కాదు. కొడుకు పుట్టాడని చెప్పినా స్పందన లేదు. తన ఉద్యోగం స్థిరంగా లేదని,

అందుకని సృజనను ఇండియాలో వుండమని చెప్పాడు. భార్య ఇండియాలో వుండగానే, అతను అమెరికాలో విడాకులు తీసుకున్నాడు.

సంవత్సరం గడిచిన తర్వాత అతను ఇంకొక అమ్మాయిని పెళ్ళిచేసుకుందామని ఇండియా వెళ్ళాడు. ఈ విషయం తెలిసిన సృజన తల్లిదండ్రులు పోలీసుల సహాయంతో పెళ్ళి ఆపారు. కానీ కొన్ని రోజులు గడిచిన తర్వాత మళ్ళీ పెళ్ళి చేసుకొని కొత్త భార్యను వెంటబెట్టుకొని అమెరికాకు వచ్చాడు.
సృజన మళ్ళీ పాసుపోర్టుకు దరఖాస్తు చేసుకొని, కొడుకుని తల్లిదండ్రుల దగ్గర వదిలిపెట్టి అమెరికా వచ్చి న్యాయపోరాటాన్ని సాగించింది. ఆమె భర్త చాలా రాష్ట్రాలలో తిరిగేవాడు. అతని ఆచూకీ కనిపెట్టటం ఆమెకు కష్టంగా వుండేది. సృజనకు దక్షిణాసియా మహిళా సంఘాలు కొంత మటుకు సహాయం చేసాయి. కానీ ఆ సంఘాల వనరులు చాలా పరిమితం. ఆమె కి కోర్టుల చూట్టూ తిరిగి న్యాయపోరాటం చేయటం కష్టమైపోయింది. చివరికి సృజన భర్త చట్టంనుండి తప్పించుకున్నాడు.

జానకి పెద్దలు కుదిర్చిన పెళ్ళి చేసుకొని, భర్తతో కలసి హెచ్ -4 వీసా మీద అమెరికా వచ్చింది. మొదటనుండి ఆమె భర్త తిట్టడం, కొట్టడం, జుట్టు లాగటం చేసే వాడు. తర్వాత వాళ్ళకి ఒక పిల్లవాడు పుట్టాడు. ఆమె వీసా గడువు ముగిసే ముందు, వన్ -వే టిక్కెట్టు చేతిలో పెట్టి పిల్లవాడితో సహా ఇండియా వెళ్ళమన్నాడు. జానకీ ఇండియాలో వుండగానే, ఆమె భర్త అమెరికాలో విడాకులు తీసుకున్నాడు. కనీసం కోర్టులో వివాహ బంధంలో కొడుకు వున్నాడని కూడా చెప్పలేదు. గత్యంతరం లేక జానకీ విడాకులకు అంగీకరించింది. ఉద్యోగం చేసుకుంటూ కొడుకును పెంచుతోంది, కొన్ని సంవత్సరాల తర్వాత కొడుకుని ఇవ్వమంటూ అమెరికా కోర్టులో కేసు పెట్టాడు. భార్య తన కొడుకుని కిడ్నాప్ చేసి ఇండియా తీసుకెళ్ళిందని ఆరోపించాడు. తప్పనిసరి పరిస్థితులలో జానకీ అమెరికా వచ్చి ఆరోపణలను కోర్టులో ఎదుర్కోవలసి వచ్చింది. అతను మంచి లాయర్లను పెట్టుకున్నాడు. మనుగడ కోసం ఆమె ఉద్యోగం చేసుకుంటూ కోర్టులలో తనపై వచ్చిన అరోపణలను ఎదుర్కొంది. ఆర్ధిక ఇబ్బందులతో సతమతమౌతూ, కోర్టుల చుట్టూ తిరిగి విసిగిపోయి, చివరికి ఆమె బిడ్డ ఉమ్మడి సంరక్షణకు ( జాయింట్ కస్టడీ ) ఒప్పుకుంది. ఈ వ్యాసం రాసే సమయానికి జానకీ ఇంకా ఆర్ధిక ఇబ్బందులతో కోర్టుల చుట్టూ తిరుగుతోంది.

మన సమాజంలో గృహహింసకి బాధితులైన తెలుగు మహిళా జీవితాలను తెలియజెప్పే కొన్ని ఉదాహరణలు మాత్రమే ఇవి. ఒంటరితనంతో నిస్సహాయతతో, సిగ్గుతో తమ కష్టాలను ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితిలో ఎందరో మహిళలున్నారు. ఏమి చేయాలో తెలియదు, సహాయం కోసం ఎవరి దగ్గరికి వెళ్ళాలో తెలియని పరిస్థితి. స్త్రీలు ఇండియాలో ఉన్న తమ తల్లిదండ్రులతో కష్టాలను చెప్పుకోలేరు. ఒకవేళ చెప్పినా వాళ్ళకి అర్థం కావనుకుంటారు. అమెరికా లోని చట్టాలు, న్యాయాలు, హక్కులు పెద్దగా తెలియవు. న్యాయస్థానాల ద్వారా కేసులు వేస్తే, అమెరికాలో

భర్త రెసిడేన్సీ స్టేటస్ కు ఎక్కడ తంటా వస్తుందోనని భయం. అమెరికా లోవున్న దక్షిణాసియా మహిళా సంఘాలను ( South Asian Women's organizations) మహిళలు సహాయం కోసం కలవవచ్చు. హింస పెట్టే మొగుళ్ళను వదిలిపెట్టిన మహిళలు తమ జీవితంలో నిలదొక్కు కుంటారు. కానీ హింసకు పాల్పడిన మొగుళ్ళు మాత్రం చట్టంనుండి తప్పించుకొని మళ్ళీ పెళ్ళిళ్ళు చేసుకొని భార్యలను హింసిస్తుంటారు. అంతటా వున్నట్టుగానే, అమెరికా లోని తెలుగు సమాజంలో కూడా గృహహింస సమస్య చాలా తీవ్రంగా వుంది. ఈ సమస్యను నివారించటానికి మనం ఆచరణాత్మక చర్యలు తీసుకొని పోరాటం చేయాలి. అలాగే దక్షిణాసియా మహిళా సంఘాలలో పాల్గొంటూ, వాటికి వీలైనంత సహాయం చేయాలి. ఈ సంఘాల సహాయంతో తెలుగు మహిళలు, భార్యలను హింసించే భర్తలను న్యాయస్థానాల ద్వారా శిక్షించాలి.

(2005 తానా సావనీర్ " తెలుగు పలుకు" లోని ఆంగ్ల వ్యాసానికి స్వేచ్ఛానువాదం. ఉషా ఆరి గారి స్వస్థలము హైదరాబాదు. మొదట పెన్సిల్వేనియా యూనివర్సిటీలో చదువుకున్నారు. తర్వాత మిచిగన్ యూనివర్సిటీ నుండి సోషల్ వర్క్ లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. మానసిక ఆరోగ్యరంగం లో సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నారు.)

## అపోహలూ, గుడ్డినమ్మకాలూ

- డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్

ప్రపంచంలో ఎదురయే వింతలూ, విచిత్రమైన విషయాల పట్ల మనిషికి ఆదినుంచీ భయాలూ, అపోహలూ, ఆసక్తీ ఉంటూనే ఉన్నాయి. ఈ మూడు భావాలూ అదే క్రమంలో కలిగాయనేది కూడా నిజం. భయం తీరి, అపోహలు కాస్త కాస్తగా తగ్గాక పెరిగే ఆసక్తి వల్ల మనిషి పరిశోధనలూ, పరిశీలనలూ మొదలుపెట్టాడు. మొదట్లో ప్రకృతిని అర్థం చేసుకోవడం, తరవాత దాన్ని తనకు అనుకూలంగా మలుచుకోవడం ఆరంభించాడు.

మొదటిది విజ్ఞానం అనుకుంటే రెండోది టెక్నాలజీ అనుకోవచ్చునేమో. ఇలాంటి వ్యాసాలను చదివిన కొందరు విద్యాధికులైన మిత్రులు ఏవో కొన్ని విషయాల గురించి తమ అభ్యంతరాలను లేవనెత్తే సందర్భంలో "మీ సైంటిస్టులు..." అంటూ వాక్యాన్ని మొదలెట్టడం చూస్తే ఆశ్చర్యం కలిగింది. సైంటిస్టులు ఏదో ఒక ప్రత్యేకజాతికి చెందినవారని ఈనాటికీ ఎవరైనా అనుకుంటూ ఉంటే అది అజ్ఞానమే అనిపిస్తుంది.

మొదటగా నిప్పు ఉపయోగాన్ని కనిపెట్టిన గుహావాసులు సైంటిస్టులే. ఫలానా చెట్టుకు కాసిన పళ్ళు విషమని తెలుసుకుని ఇతరులకు హెచ్చరించినవాళ్ళూ సైంటిస్టులే. ఎప్పుడూ అశుభ్రంగా ఉండే ప్రాంతాల్లో తిరుగుతూ, ఇంటి పనులు చేసుకుంటూ ఉన్న స్త్రీలు కాళ్ళకు పసుపు రాసుకుంటే క్రిమిసంహారకంగా పని చేస్తుందనీ, ఇంటి గడపలకు పసుపు రాస్తే క్రిములు లోపలికి ప్రవేశించవనీ చెప్పిన మనవాళ్ళు సైంటిస్టులు కారా? అలాగే విత్తులు నాటి వ్యవసాయం మొదలెట్టినవారూ, మబ్బుల కదలికనూ, రుతువుల క్రమాన్నీ అర్థం చేసుకుని "నువ్వులు" జాగర్త చేసినవారూ, రాత్రి పూట నక్షత్రాల సహాయంతో ఓడలు నడిపినవారూ అందరూ తమతమ కాలంలో అందుబాటులో ఉన్న జ్ఞానాన్ని వినియోగించుకున్న సైంటిస్టులే. ఇదంతా సైన్స్ కాదనీ నిజమైన సైంటిస్టు తాను సంపాదించిన జ్ఞానాన్ని విశ్లేషణ కూడా చేస్తాడనీ వాదించవచ్చు. శైశవదశలో మొదలైన మానవ సమాజం ఆ దశకు చేరుకోవడానికి సమయం పట్టింది. ఏమైనా కొంత వివేచనా, వివేకమూ ఉండడం వల్లనే మనిషికి ప్రాథమిక విజ్ఞానం అందుబాటులోకి వచ్చిందనడంలో సందేహం లేదు.

విజ్ఞానం పెరిగిన చోట గుడ్డి నమ్మకం తగ్గుతూపోతుంది. క్రీస్తుకు రెండు మూడువేల ఏళ్ళ క్రితం సుమేరియన్ నాగరికతలో వానలు కురిసినప్పుడు "మార్దుక్" అనే దేవతవల్ల పంటలు పండుతాయనే నమ్మకం ఉండేదట. ఆ తరవాత ఆ నాగరికతకు పరోక్షంగా వారసులైన గ్రీక్ తత్వవేత్తలు క్రీ.పూ. అయిదో శతాబ్దం ప్రాంతంలో మార్దుక్ సంగతి వదిలేసి వానలు కురిసినప్పుడు పంటలు పండుతాయనే ప్రతిపాదన చేశారట. ఇది విజ్ఞాన ప్రగతిలో ఒక మెట్టు. ఈ నాటికీ ఎంత దైవభక్తి ఉన్నా, పొయ్యి మీద పెట్టిన పాలు పొంగకుండా ఉండటానికీ, బైటికి వెళ్ళేటప్పుడు

దొంగలు చొరబడకుండా వీధి తలుపుకు తాళం వెయ్యటానికి ఎవరూ దేవుడి మీద ఆధారపడరు. దీని కర్థం ఒకటే. మనకి తెలియనివీ, ''అలవి'' కానివీ అయిన విషయాల్లోనే మనం దేవుణ్ణి నమ్ముతాం. దీన్ని బట్టి చూస్తే మనం ఆదిమ మానవులంత వెనకబడి ఉన్నట్టే అనిపిస్తుంది. ఎందుకంటే ఆ రోజుల్లో అడవుల్లో వాటంతటవే రాజుకునే అగ్నికీలలూ, అకస్మాత్తుగా ఉరిమి, వర్షించే మేఘాలూ అన్నీ అప్పటివారిని భయభ్రాంతులను చెయ్యడంతో వారు అగ్నిదేవుణ్ణీ, వానదేవుణ్ణీ, వాయుదేవుణ్ణీ ఊహించుకుని వారిని ''మంచి'' చేసుకోవడానికి పూజలు చేశారు.

ఇవన్నీ ప్రకృతిసిద్ధంగా జరిగే విషయాలేనని అర్థం అయిన దశలో ఈ దేవుళ్ళ ప్రాభవం తగ్గిపోయిందని మనకు తెలుసు. అందుచేత మరింత నాజూకు పద్ధతుల్లో గుడ్డిగా అన్నిటినీ నమ్మే ఆధునికులు ఆటవికదశను దాటారని చెప్పలేం. అంతేకాదు; గ్రామదేవతలకు బలులిచ్చి మొరటుగా పూజలు చేసేవారికీ, తిరపతివంటి ''పెద్ద'' ఆలయాలకు వెళ్ళి సంస్కృతంలో శ్లోకాలు చదివేవారికీ ఏ మాత్రమూ తేడాలేదు. అలాగే మొక్కుల మీద నమ్మకం ఉన్నవారికీ, బుడబుక్కలవాణ్ణి పిలిపించేవారికీ, చిలక జోస్యంగాళ్ళకూ కూడా పెద్దగా తేడాలేదు.

అజ్ఞానానికి నమ్మకం అనేది ప్రత్యామ్నాయం. వ్యక్తిగతంగానూ, సామాజికంగానూ గుడ్డినమ్మకాలు కొంత ఊరటనిచ్చి మేలు చేస్తాయని సైకాలజిస్టులు మనకు చెప్పవచ్చు. అదే నిజమైతే నమ్మకాలు ఒక ఊతకర్ర వంటివి మాత్రమే అని గుర్తించడం అవసరం. జీవరాశి అంతా కేవలం జీవరసాయనాల కలయికవల్లనే రూపొందిందని రెండు మూడు తరాలుగా నేర్చుకున్న పాశ్చాత్య సమాజంలో ప్రజలకు వ్యక్తిగత స్థాయిలో దేవుడి మీద మనవారిలాగా గుడ్డినమ్మకం ఉండదు. అందువల్లనే ఆ దేశాల్లో ఫ్లయింగ్ సాసర్ల గురించీ, గ్రహాంతరవాసులు రావడం గురించిన నమ్మకాలు పెరుగుతున్నాయని కొందరు విశ్లేషకుల అభిప్రాయం. మన దేవతల్లాగా నాలుగు చేతులతో (ఆడదేవతలు అందుకు అనువైన బ్లౌజులు కూడా ధరించినట్టు బొమ్మలు గీస్తారు) ఎవరూ ప్రత్యక్షం కారు గనక పాశ్చాత్యదేశాల్లో గ్రహాంతరవాసుల చిత్రీకరణ ఆకుపచ్చని మొహాలతో, బాగా వెడల్పైన నుదుటితో (ఎక్కువ తెలివితేటలు కదా!), తలమీద రెండు ఏంటెనాలతో జరుగుతుంది. ఇది ఎక్కువ ''సహేతుకం'' అనిపిస్తుందేమో కాని ఇదీ ఒకరకమైన గుడ్డినమ్మకంతో కూడిన ఆశాభావ దృక్పథం. మనిషిని ''మించిన'' శక్తి, లేదా వ్యక్తి కోసం వెతుకులాట.

మనకు తెలియని విషయాల గురించి మతం పేరుతో వివరణ ఇచ్చేవారిని నమ్మకుండా ఉండడమే మంచిది. ''దేన్నైనా ఎలాగైనా సమర్థించవచ్చు కదా'' అన్న వాదం ప్రమాదకరం. సైన్స్‌లో తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయి. వాటిని గురించి ఎప్పటికప్పుడు ప్రయత్నించి, మరింతగా తెలుసుకోవడమే లక్ష్యం. మూఢనమ్మకాలనూ, అర్థం లేని మతవిశ్వాసాలనూ ప్రోత్సహిస్తూ, పుట్టేది ఆడపిల్ల అయితే అందుకు తల్లే కారణమని నిందించే

మూర్ఖులు ఈ నాటికీ మధ్యతరగతి విద్యాధికుల్లో ఎందరో కనిపిస్తారు. వీరి సంగతే ఇలా ఉంటే సగం అక్షరాస్యులైన కోట్ల ప్రజల మాటేమిటి? తన డయాబిటీస్ వ్యాధినే నయం చేసుకోలేని బాబా ''శక్తుల'' గురించి పైనపైనాలుగా వర్ణించేవారిని ఏమనాలి? ప్రజల అమాయకత్వాన్నీ, అయోమయాన్నీ ఆసరాగా చేసుకుని పబ్బం గడుపుకునేవారిని పట్టుకునే దెవరు? ఈ ప్రశ్నలకు జవాబులు లేవు. ''ఆస్తికులు'' ఇలాటి వ్యాసాలు చదవరు.

అయినా బొత్తిగా నిరుత్సాహపడవలసిన అవసరం లేదు. అప్పుడప్పుడూ వెనకడుగు వేసినా మానవసమాజం భౌతికవాదం దిశగానే ముందుకు వెళుతుంది. జనాభా పెరిగి, సమస్యల పరిష్కారాలకు టెక్నాలజీ మీద అంతకంతకూ ఎక్కువగా ఆధారపడవలసిన ప్రస్తుత పరిస్థితుల్లో అది తప్పనిసరి అవుతుంది. ఉదాహరణకు మశూచివంటి వాటికి కారణం ''అమ్మవారు'' కాదని నెమ్మదిగా జనం తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంలో పల్లెపల్లెకూ తిరిగి ఓపికగా ప్రజలకు నచ్చజెప్పి టీకాల ద్వారా రోగవ్యాప్తి నిరోధానికి పాటుపడిన వైద్యులకు తగిన గుర్తింపు రాకపోవచ్చు. కానీ వాళ్ళని ఎవరూ నాస్తికులని తిట్టలేదు. మనదేశంలోలాగానే ఒకప్పుడు గ్రీక్ తత్వవేత్తలు ప్రయోగాలద్వారా జ్ఞానం పొందడం మానేసి కేవలం ''వాదనల'' ద్వారా తత్వపరమైన ఆలోచనలు చేసేవారట. అలాకాకుండా ఎవరో కొందరు ప్రతిదాన్నీ ప్రయోగాత్మకంగా పరిశీలన చెయ్యడం వల్లనే మానవజాతి ఈ మాత్రమైనా ప్రగతిని సాధించిందని చాలామంది గుర్తించరు. మూఢవిశ్వాసాలకు కొత్తరంగులు పులుముకుంటూ, వాటిని బలపరచడం తమ జన్మహక్కయినట్టు ప్రవర్తించే ఆధునిక ఆటవికులకు ఈ విషయం ఎన్నిసార్లు చెప్పినా తప్పలేదు.

## సెగమంటలు - దాదా హయత్

మాల ఒబులేసు నీరసంగా రిక్షా తోసుకుంటూ వచ్చి తన ఇంటి ముందాపాడు. ఇల్లంటే ఇల్లు కాదది బోద వసారా. పేరుకు మాత్రం చుట్టూ నాలుగు మట్టిగోడలుంటాయి. ఆ నాలుగు గోడలు కూడబలుక్కొని కూడా ఆ ఇంకో మంచి కొట్టం రూపైనా ఇవ్వలేక పోతున్నాయి.

ఒబులేసు ఇంటికాడ రిక్షా ఆపుతూనే బిలబిల మంటూ అతని ఆరుగురు సంతానం వచ్చి చుట్టేశారు.

''నాయనా! నాయనా! " ''య్యా! యేందే సీదర బొండి'' కసిరాడు ఒబులేసు. అతని భార్య లక్ష్మి ముసి ముసిగా నవ్వుకుంటూ కొట్టం లోంచి బయటి కొచ్చింది.

"మాపిటాలైతే నువ్వు మనిషివి కావా యేంది? పిల్లోల్లు యాల నీకాడి కొచ్చినారో గూడ్కా అడగవా?" అందీ తెచ్చి పెట్టుకున్న కోపంతో.

"యేంది సంగతి?" అన్నాడు ఒబులేసు రిక్షా చక్రంకాడ గోడవారగా కూలబడుతూ.

సాయంకాలం మసక చీకట్లు కమ్ముతున్నాయి. లక్ష్మి కొట్టంలో కెళ్ళి దీపం తెచ్చి గుమ్మం దగ్గరుంచింది ఏదో ఖాళీ మందుల సీసాలో గబ్బు నూనె పోసి అందులో పాతగుడ్డ పీలిక వేసి మాతకు రంధ్రం పెట్టి వెలిగించిన దీపము. ధగద్ధగాయ మానంగా వెలుగుతోంది.

"యేందో సెప్పవ?" అన్నాడు ఒబులేసు.

లక్ష్మి చేతులు ముందుకు తెచ్చి మురిపెంగా అతనికి చూపించింది ఆ చేతుల్నిండా కొత్త గాజులున్నాయ్ .

"యాడియో చెప్పుకో." ''యాడియి? " అడిగాడు ఒబులేసు. ''మద్దేన్నం ఓట్లడుగుతా సంగెరెడ్డుల్లు వచ్చి పోయినారు. ఓటుకు ఇరవైరూపాయలిచ్చినారంటే! అందుకే పిల్లోల్లు గూడ్కా యీ పొద్దు వుషారుగా వుండారు'' చెప్పింది లక్ష్మి.

"ఓటుకు ఇరవై రూపాయలిచ్చి నారా! లెక్కేడ బెట్టినావ?" హడావుడిగా లేవబోయాడు ఒబులేసు.

అతనింట్లో మొత్తం అయిదు ఓట్లున్నాయి. ఒబులేసు, లక్ష్మి, ఒబులేసు తల్లిదండ్రులు, ఒబులేసు పెద్దకూతురు వీరమ్మ. ఆ పిల్లకు ఇంకా పదిహేనే సరిగ్గా నిండలేదు. అయినా పద్దెనిమిది నిండినట్లు రాయించారు. ఇక ఒబులేసు తల్లిదండ్రులు చనిపోయి చాలా కాలమైంది. అయినా ఓటర్ల లిస్టు నుంచి వాళ్ళ పేర్లు తొలగించడం జరగలేదు. ఈ తిరకాసులన్నీ ఒబులేసుకి తెలిసేవుండాల్సిన అవసరం లేదు. అన్నీ నాయకులే శ్రద్ధగా చూసుకుంటారు. ఎటొచ్చి ఆ ఓటు తమకు పడాలి అంతే. ఓటుకు ఇరవై రూపాయలంటే అయిదు ఓట్లకు నూర్రూపాయలు . ఒబులేసు అంత డబ్బు ఒకేసారి కళ్ళజూసి చాలా రోజులైంది.

లక్ష్మి అతన్ని లేవనియ్యకుండా వెనక్కి తోసింది.

“పోయి దొంగసారా తాగుతావా? లెక్క నీకియ్యను” ”నా కియ్యకపోతే ఎవరికిస్తావే? ఏ రెండో మొగుని కిస్తావా?” కోపంగా అన్నాడు ఓబులేసు.

“అదో, అట్లాంటి మాటలంటేనే నాకు మండుతాది నేనేం జేస్తా లెక్క? నీమాదిరిగా దొంగసారా తాగుతానా? ఏదో నేనింత తిని పిల్లోల్ల కింత పెడ్తా అంత దానికి నాకు రెండో మొగుడుండాడంటావా?”

ఓబులేసు ఆ మాటతో కొంట తగ్గాడు సర్లేయే? లెక్క యాడిబెట్టినావ?” అన్నాడు బతిమాలుకుంటూ.
“ఉండాదిలే పెట్టిన కాడ అయినా ఇయ్యాల నీకు లెక్క పెట్టి దొంగసారా తాగాల్సిన కర్మేమి? మనకందరికి సారా సంగిరెడ్డోల్లే యేపిస్తుండారు.” ”నిజమా?” అన్నాడు ఓబులేసు నోరు తెరిచేసి. నిషేధం తర్వాతా ఓబులేసుకి సారా దొరకడం లేదు. దొరకడం లేదంటే దొరుకుతుంది. వారుణ వాహినీ మయంగా ఎంతకావాలంటే అంత దొరుకుతుంది. అయితే అందుకు డబ్బు చాలా అవుతుంది. అందుకే ఓబులేసు ఈ మధ్య సాయంకాలమైతే సచ్చిన పాయలో అన్నట్టు నీరసంగా వుంటున్నాడు. ఉచితంగా ఆరోజు సారా వస్తుందంటే అప్పటికపుడే అతని నాలుక పీకనారంభించేసింది.

“నేను అపద్దం చెప్తానా యేంది? రేత్రికి సియ్యలు గూడ్కా వుందియి” అంది లక్ష్మి వదులు బోతూ.

ఓబులేసు ఈసారి హుషారుగా లేవబోయాడు. అయితే అంతలోకే ఏదోగుర్తు కొచ్చి మళ్ళీ సాలోచనగా కూర్చుండిపోయాడు.
“ఏమాయె ?” అడిగింది లక్ష్మి. ”అదికాదు సంగిరెడ్డికాడ లెక్క దీసుకుంటే దస్తగిర్రెడ్డి ఏమనడా అని”. లక్ష్మికి అతని అనుమానం అర్ధమైంది.

“దస్తగిర్రెడ్డి యాడుండాడులే రాముడుంటే దస్తగిర్రెడ్డిల్లేకుంటే లేదు. పోలీసోల్లు రామునితో పాటే దస్తగిర్రెడ్డి అల్లున్ని గుడ్కా లోపలేసి నారంట, ఈసారి దొంగ ఓట్లు పడవంటనే? పోలీసోల్లు గట్టిగా వుంటారంట” అంది.

“అంతేనంటావా? సరే సూద్దాంలే” అంటూ లేచి నిలబడ్డాడు. ఓబులేసు సారామీద ఆశ అతన్ని అంత కంటే ఎక్కువ ఆలోచించనివ్వలేదు. ఇంట్లో కెళ్ళి తప్పెట చేతితోకి తీసుకొని అది సరిగ్గా వుందో లేదో చూశాడు.

ఆ రాత్రి మాలవాడలో సెగమంటలు వేశారు. మగవాళ్ళంటా మంట చూట్టూ చేరి తప్పెట్టక సెగ చూపిస్తున్నారు. ఆడవాళ్ళూ పిల్లలూ మరో వంక బారులు తీరి కూర్చున్నారు. ప్లాస్టిక్ బకెట్లలో సారాసీసాలు సిద్ధంగా వున్నాయి. ఇంకో వైపు నిప్పల మీద మాంసం కడ్డీలు కాలుతున్నాయి. సారా తాగే వాళ్ళు తాగుతున్నారు. చియ్యలు తినేవాళ్ళు తింటున్నారు.

"తాగండ్రా తాగండి సియ్యలు బాగా బాగా తినండి రూపు ఒక్కోడూ తక్కువంటే పదోట్లు బేసి రావాల. ఎంటకావాల్నో తాగండి," అంటున్నాడు అడ్డోడు. సంగిరెడ్డి తరుఫున అతనే అక్కడ కార్య నిర్వాహకుడు.

అంతవరకు తన తప్పెట్లో మోత ఎలా వస్తోందో పరీక్షించుకుంటున్న ఓబులేసు మెల్లగా అడ్డోని పక్కలో చేరాడు. "అది కాదన్నా అడ్డోడన్నా! ఈ సారి దొంగ ఓట్లు పడవంటనే? " అన్నాడు. "ఎందుకు పడవు లేరా వూకే అంటుంటారు గానీ ఈ పోలీసోల్లు. అందుకే చెప్తాండా. రేపు ఒక్కోడూ పదోట్లన్నా బేసి రావాల" అన్నాడు అడ్డోడు.

"సంగిరెడ్డికి ఓట్లేసి మండలాధ్యచ్చున్ని చేస్తే మాకు పక్కా ఇండ్లు కట్టిపిస్తాడా ? బోద కొట్టాల్లోనచ్చాండా. ఎండాకాలమొస్తే అగ్గెంటుకుంటాదని గుండె సేతుల్లో పెట్టుకోని బరుకుతాండాం."

"ఊ అందులో నీకు అనుమానం యేమిటికి, సంగిరెడ్డి మీ అందరికీ పక్కా ఇండ్లు కట్టిపిస్తాడు. మరేం భయం లేదు పో, అందరూ పెచ్చంగా పక్కా ఇండ్లల్లో బాగుందురుగాని."
"అది కాదన్నా! పోయినసారి దస్తగిర్రెడ్డి పక్కా ఇండ్లు కట్టిపిస్తానని చెప్పినాడు ఏడీ, కట్టిపీల్యా."
దస్తగిర్రెడ్డికీ , సంగిరెడ్డికీ ఒకటే నేందిరా? ఇప్పుడా కాలం పాయ గదా. మీకేం కావాల్నో నాకు చెప్పండి. సంగిరెడ్డికి చెప్పి నేను చేపిస్తా మీ పనులు. పక్కా ఇండ్లూ వస్తాయ్ , అన్నీ వస్తాయ్ . రూపు మీ ఓట్లు మాత్రం మర్చిపోకుండా సంగిరెడ్డికే బేయండి ఒక్కోడూ పది ఓట్లు బేయండి"
ఆ మాటతో ఓబులేసుకు హుషారొచ్చేసింది బాగా తాగేసి తప్పెట వాయిస్తూ పాటందుకున్నాడు.

"వచ్చెర వచ్చెర సంగిరెడ్డెన్న! తెచ్చెర తెచ్చెర పక్కా ఇండ్లు! వచ్చెర వచ్చెర సంగిరెడ్డెన్న! వచ్చెర వచ్చెర తెచ్చెర తెచ్చెర! "
ఓబులేసు పాటలు వంత పాడుతూ మిగతా వాళ్ళు కూడా తప్పెట్లు వాయించడం మొదలెట్టారు. ఆడవాళ్ళు నవ్వుతున్నారు. పిల్లలు కేరింతలు కొడుతూ సెగమంటల చుట్టూ వలయాలు కట్టి తిరుగుతున్నారు. వాతావరణం పండగలా వుండి. దేవరలో గానీ అలాంటి పండగ వుండదు. ఆ రాత్రంతా తప్పెట మోతలతో మాలవాడంతా మారుమోగి పోయింది.
తెల్లారింది. ఎవరిళ్ళలో వాళ్ళు అంతా తాగి పడున్నారు.
అంటరానితనం తెలీని సూర్య కిరణాలు మిగతా లోకమంతటితో పాటు మాలవాడను కూడా ప్రేమగా స్పృశిస్తున్న సమయంలో అక్కడ ఒక్కసారిగా అలజడి చెలరేగింది.

ఎవరో వచ్చి ఓబులేసు కొట్టం తడుపు దబదబా బాదేస్తున్నారు.
"ఒరే, ఓబులేసూ! ఇంగా పండుకున్నావా! రాముడొచ్చేసినాడ్రా ! రాముడొచ్చేసినాడ్రా ! "
ఎవరిదో ఆక్రోశిస్తున్న ఆడగొంతు. ఓబులేసికు మెలకువొచ్చింది తల దిమ్ముగా వుంది వెళ్ళి తలుపు తీశారు.

“ఎవరే”

నాలుగిళ్ళ అవతలుండే ముసల్ది తనని లేపినట్టే అందర్నీ తలుపులు బాది నిద్రలేపుతోంది. తన కొడుకుని రాముడు చెట్టుకు కట్టేసి కొడుతున్నాడని లబలబా మొత్తుకుంటోంది.

రాముడు వచ్చేశాడన్న మాట బుర్రలో ఇంకగానే ఓబులేసు మత్తంతా దిగిపోయింది.
“ ఓట్లయి పోయినంత వరకు పోలీసోల్లు వదలమన్నారే! ఎట్లా వదిల్నారబ్బా?” అని బిగ్గరగానే అనుకుంటూ ఆందోళనగా భార్యని సమీపించాడు.
అతనింకా లక్ష్మిని నిద్ర లేపనే లేదు.

ఎక్కడ్నించి వచ్చారో కొందరు మనుషులు ధనామంటూ తలుపు తోసుకుంటూ వచ్చి అతనింట్లో జొరబడ్డారు. అడ్డంగా నేల మీద పడుకున్న పిల్లల్ని కాళ్ళతో తన్నుకుంటూ వెళ్ళి ఓబులేసు వీపు మీద నాలుగు పిడిగుద్దులు వేశారు.

గుండె అదరినట్లనిపించి, “అమ్మా” అన్నాడు ఓబులేసు.
లక్ష్మి తత్తరపాటుతో లేచి కూర్చుంది.
పిల్లలు అప్పటికే పెద్దగా ఏడుస్తున్నారు.

వచ్చిన వాళ్ళు ఓబులేసుని చొక్కా పట్టుకొని ఈడ్చుకుపోనారంభించారు.
“ఒర్నాయనో! నా మొగున్నిగ్గుకుపోతాండార్రా! ” అని వెర్రిగా అరుస్తూ లక్ష్మి ఆ వెనకాలే పరిగెత్తింది. రాముడు ఒక చింత మానుకు మంచి వయసులో వున్న నలుగురు మాలకుర్రాళ్ళని కట్టేసి కర్రతో గొడ్లను బాదినట్టు బాదుతున్నాడు. అక్కడే వుండి అతన్ని ఎగదోస్తున్న దస్తగిర్రెడ్డి అల్లుడు కుల్లాయరెడ్డి శివమెత్తినట్లు మాలజాతి నంతటినీ బండబూతులు తిడుతున్నాడు.

కుల్లాయరెడ్డి మనుషులు ఓబులేసుని ఈడ్చుకొచ్చి అతనిముందు పడేశారు. ఓబులేసు గబాల్న కుల్లాయరెడ్డి కాళ్ళు పట్టుకున్నాడు.
“కొట్టాకన్నా! మమ్మల్ని కొట్టాకన్నా!” కుల్లాయరెడ్డి కాలు పైకెత్తి ఓబులేసు గుండె మీద తన్నాడు. ఓబులేసు వెనక్కిపడ్డాడు. తల ధనామంటూ నేలకేసి కొట్టుకుంది. ”ఏమిరా! సంగిరెడ్డికాడ లెక్క తీసుకుంటారా?” అన్నాడు కుల్లాయరెడ్డి ఓబులేసు మొహం మీదకి వంగులూ ”లేదన్నా!” ఏడుస్తూ అన్నాడు ఓబులేసు ”నీ సంగతేంది? సంగిరెడ్డి మిందపాట గుడ్కా పాడ్నావంటనే!” ”లేదన్నా! లేదు” ”అయితే పో సంగిరెడ్డి లెక్క యెనకిచ్చేసిరా పో మీకు లెక్క కావాల్నంటే దస్తగిర్రెడ్డి ఈనన్నాడా? సారాయేపిచ్చమంటే యేపిచ్చనన్నాడా? ఓటుకు ఇరవై ఇస్తాన్నాడు కదా సంగిరెడ్డి? వోటుకు దస్తగిర్రెడ్డి యాభై ఇస్తాడు పొండి. వోట్లు మాత్తరం దస్తగిర్రెడ్డికే పడాల పడకపోయినాయా, తోలొలిపిస్తా పో, లెక్క ఇచ్చేసి రా పో”

ఆ రోజే మాలవాడ మాలవాడంతా కదిలి అడ్డోడి ఇంటికి వెళ్ళారు. ''ఏందిరా వచ్చినారు?'' అన్నాడు అడ్డోడు ఒక్కసారిగా అంతమందిని చూసి బెదిరిపోతూ. ఓబులేసు ముందుకొచ్చాడు.
''అన్నా ఏమనుకోవాకు రామున్నీ కుల్లాయరెడ్డినీ పోలీసోల్లు ఇడిసేసినారు. నీకు దండం పెద్దాసామీ, సంగిరెడ్డెన్నని యేమనుకోవాకని చెప్పు ఇదో మీరిచ్చిన లెక్క''
ఓబులేసుతో పాటు ఒక్కొక్కరూ ముందుకొచ్చి ఎవరికిచ్చిన డబ్బు వాళ్ళు అడ్డోడి ముందర పెట్టి వెళ్ళిపోతున్నారు. లక్ష్మి ఆ డబ్బుతో తాను కొన్న గాజుల్ని కూడా వలిచేసి అడ్డోడి ముందర పెట్టేసింది. గాజులు వలుస్తుండతా ఆమెకు కన్నీరు ఆగింది కాదు. ఆ మర్నాడు పొద్దునే ఏడు గంటలకు ఎలెక్షన్ ప్రారంభమై పోయింది.
దొంగ ఓట్లు వేయడానికి వెళ్ళిన ఓబులేసు భార్యబిడ్డలు బిక్క మొహాలతో వెనక్కి తిరిగి వచ్చేశారు.

ఆ సమయంలో కుల్లాయరెడ్డి ఒకింట్లో ఓట్లు అంగడి పెట్టుక్కూర్చున్నాడు. రాముడు కూడా అక్కడే వున్నాడు. దొంగ ఓట్లేసి వచ్చిన వాళ్ళంతా అక్కడ సిరా గుర్తు తుడిపేసుకునే ప్రయత్నంలో వున్నారు. కొందరు కిరసనాయిల్తో, కొందరి స్పిరిట్ తో, ఇంకొందరు అగ్గిపుల్లల్తో తంటాలు పడుతున్నారు.
''ఏమ్మే, ఓట్లు బేసొచ్చినారా? '' గద్దించాడు రాముడు. ఆ హుంకారానికి బెదిరిపోతూ తల్లీ కూతుళ్ళిద్దరూ ఒక మాలకు ఒదికి పోయారు.
''లేదన్నా , మాయన్నీ దొంగ ఓట్లని ఆడ తరిమేస్తాండారు,'' దీనంగా అంది లక్ష్మి. ''వాల్లు తరిమినారా, మాకు ఓట్లు బేయాల్సి వస్తాదని మీరే ఎల్లబారొచ్చేసినారా? డ్రామాలేస్తాండావేమే? ''
''లేదన్నా, సత్తెం చెప్తాండాం'' చేతులు నులుపుకుంటూ అంది లక్ష్మి.
''నీ మెగుడెవరని అడుగుతాండారాన్నా ఆడ నేను బద్రిగాడని చెప్పినా. వాల్లు నమ్మలా, ''
నీ మొగుని పేను ఓబులేసుగదేమే. మాకు తెల్సులే. దొంగ ఇటు కోసం ఇంగెవర్నో మొగుడని చెప్పకోను సిగ్గులేదేమే లంజల్లారా మీకు అనే కూడా తిట్టినారన్నా'' కన్నీరు పెట్టుకుంది.

కుల్లాయరెడ్డి ఓబులేసు వంక చూశాడు. ''రేయ్, ఇలారా'' ఓబులేసు చేతులు కట్టుకుని ముందుకొచ్చాడు. కుల్లాయరెడ్డి ఓటరు చీటి ఒకటి అతని చేతిలో పెట్టి. ''ఈ ఓటు బేసిరాపో బేయకుండా ఎనక్కొచ్చినావా, నీ పెండ్లాం నీది కాదు'' అన్నాడు.

ఓబులేసు వణికిపోతూ ఆ చీటీ పట్టుకొని బయల్దేరాడు. పోలింగ్ బూతు దగ్గర క్యూలో అరగంట నిలబడ్డాక అతని వంతొచ్చింది.
''వరుస నెంబరు రెండొందాలా పది'' అరిచాడు పోలింగ్ అసిస్టెంటు. ఇందాక లక్ష్మికి అబ్జెక్షన్ చెప్పిన సంగిరెడ్డిరపు పోలింగ్ ఏజెంటే ఓబులేసుని చూసి కనుక్కున్నాడు.
''ఏమిరా ఓబులేసూ! ఎంకటయ్య ఓటు బేసేదాని కొచ్చినావా? దొంగ నా కొడకా! ఇందాకనే నీ పెండ్లాం వచ్చిపాయగదరా! ఇప్పుడు నువ్వొచ్చినావా? మీ కుటుంబం కుటుంబం అంతా దొంగ ఓటు బతుకేనేమిరా?

పోరా, బయటికి పో''. ఓబులేసు కదల్లేదు. ''పొమ్మంటే పోవేమిరా?'' గర్జించాడు ఏజెంటు. ఓబులేసు అప్పటికీ కదల్లేదు తల వంచుకుని నిలబడ్డాడు. డ్యూటీ కానిస్టేబుల్ అతను కదలక పోయేసరికి వచ్చి మెడ పట్టుకున్నాడు.

''కదులూ'' హాలు దద్దరిల్లి పోయేటు పెను కేకవేశాడు.

ఓబులేసుని కొంతదూరం వరకు కానిస్టేబుల్ ఈడ్చుకు పోగలిగాడు. అయితే గుమ్మం ఎటుందో అతనికి చూపించక ముందే ఓబులేసు ఆ పట్టులోంచి తప్పించుకుని పరిగెత్తుకుంటూ వచ్చి పోలింగ్ ఆఫీసరు ముందు మోకాళ్ళ మీద కూలబడ్డాడు.

''సామీ! మాల నాకొడుకుని సామీ! ఎవనిక్కోపం వచ్చినా కాలు ఎగ్గేసి, ఎగ్గిసి నన్నే తంతారు. ఈ ఓటు నన్ను బేయనీయండి సామీ! నిజమే సామీ, నాది దొంగ ఓటు బతుకే సంగిరెడ్డి గెల్సినప్పుడూ గొంగ ఓటే బేసినా, దస్తగిర్రెడ్డి గెల్సినప్పుడూ దొంగ ఓటుబేసినా ఇప్పుడూ దొంగ ఓటు బెయనీకే వచ్చినా నా ఒక్కన్దే దొంగ ఓటేమీ సామీ! ఈడ పెట్టెలో పడ్తాండేయన్నీ మంచి ఓట్లేనా సామీ? ఎవనికి తెల్దు సామీ! దొంగవోటు బేయకుంటే మమ్మల్ని సంపుతారు సామీ! ఈ దొంగ ఓటు బేయకుంటే నా పెండ్లాం నాదికాదు సామీ! బేయనీయండి సామీ! ఈ దొంగ ఓటు బేయనీయండి సామీ! ''

వోబులేసు ఆ మాటలంటున్నప్పుడు ఒక్కసారిగా వరదొచ్చినా పెన్నలా హోరుమన్నాడు. అనేశాక పెన్నలాగే చివర ఎండిపోయాడు. రెండు చేతులూ కడుపులో పెట్టుకున ఆఫీసరు కాళ్ళ దగ్గర లుంగ చుట్టుకుని పడిపోయాడు.

ఒక్కసారిగా అక్కడ భయంకరమైన నిశ్శబ్దం అలుముకుంది.

వోబులేసు గుండెలో సెగ మంటలు రగుల్తున్నాయి.

## స్త్రీ సాహిత్యం - ఉల్లేఖనాలు




ఆ వస్తున్న సూర్యోదయం మాదే
ఆ ప్రభావగీతం మాదే
ఇక మీద భూమ్మీదవిస్తరించే
నాగరికత ఖచ్చితంగా మాదే

- మహె జబీన్, ఆకురాలు కాలం, పేజీ 21.

………………………………………………………..

అత్యుత్తమ గుణసంపద మాకు ఆపాదించి
మంచితనం తాలూకు మహత్వలక్షణాలన్నీ పులిమి
పొగడ్తల పొగడపూలదండల్లో
జ్ఞానరష్మినివ్వని సతీధర్మపు చెమ్మటెండల్లో మమ్మల్నింకా ముంచెత్తకండి
స్వేచ్ఛ మనిషి హక్కు – సమత మేం వల్లించే రుక్కు

- ఘంటసాల నిర్మల, నిర్వచనం, పేజీ 5

……………………………………………………………

ఓడినా సరే
ఎవరి యుద్ధం వాళ్ళే చేయాలి
నీ కోసం వాళ్ళు యుద్ధం గెలిచారో
నిలువునా మునిగిపోతావు
ఎప్పటికీ ఓడిపోతావు

- సుధ, నీలి మేఘాలు , పేజీ 141

……………………………………………………………

“సమానత్వం లేకుండా స్వేచ్ఛ ఉంటుంది గానీ స్వేచ్ఛ లేకుండా సమానత్వానికి అర్థం ఉండదు. అది నిలబడదు కూడా. సమాజంలో అసమానతలను పోగొట్టి సమానత్వం సాధించాలన్నా, సమాన హక్కులూ అవకాశాలూ వున్న మనుషులు సహకరించుకొంటూ బతకాలన్నా, ముందు మనిషి సాధించాల్సింది స్వేచ్ఛ.”

- ఓల్గా, “స్వేచ్ఛ” కు ముందు మాటలో

……………………………………………………………

“దేశానికి దేశాలు కొట్టుకు పోతుంటే, యింకా పసుపు పారాణులకోసం అంటు తప్పాలమీద మెతుకుల కోసం, సిగ్గు బిడియాల కోసం గింజుకులాడే మన అత్తల్నీ,శీల అశ్లీలాలకోసం తెలుగు కథకుల్ని, బడి టీచర్లనీ, పత్రికా విమర్శకులను చూసి నవ్వొస్తుంది, దిగులేస్తుంది”

- చలం

…………………………………………………………..

“అత్త అధికారం నుంచి, భర్త అధీనం నుంచి తప్పించుకుంటున్న నవీన స్త్రీ షోకులకి, సంఘగౌరవానికి, ఫాషన్ కీ బానిస ఔతోంది. ఒక పురుషుడినీడకింద నించుని లోకాన్ని ధిక్కరించగలిగే యిల్లాలు, ఈనాడు సంఘగౌరవం పేర, విద్య పేర, ఉద్యోగం పేర, ఫాషన్స్ పేర వెయ్యి మందికి దాస్యం చేస్తోంది. నవీన స్త్రీకి తన చుట్టూ స్త్రీలందరూ అత్తలైనారు.”

- చలం

…………………………………………………………

“భారత స్త్రీ దౌర్భాగ్యాన్ని, పిరికితనాన్ని, దీనత్వాన్ని చూసి చలం ఎంతగానో విలపించాడు. మండి పడ్డాడు. స్త్రీని శాశ్వతంగా బానిసత్వంలోకి నెట్టాలనుకున్న సంఘాన్ని, మతాల్ని, పురుష దురహంకారాన్ని అసహ్యించుకుని, కసి పెంచుకుని, తిట్టి, ముఖంమీద ఉమ్మి, స్త్రీ జాతిని వాళ్ళ వాంఛలకి, ఆశయాలకి, ఆలోచనలకు మేల్కొలిపి ధైర్యాన్నిచ్చి, తిరుగుబాటు చైతన్యాన్నిచ్చి ముందుకు నడపడానికి ప్రయత్నించినవాడు చలం ”

- సి రా

## ఓల్గా రచనలు: ప్రసంగాలు

1) స్త్రీవాదం ( ఫెమినిజం ) - స్త్రీ సాహిత్యం, అయోని కథ

http://prajakala.org/audio/volga_02401.mp3

2) యోగం అనే పెద్ద కథలో చిన్న భాగం ఇది

http://prajakala.org/audio/volga_02402.mp3

3) గులాబీల నవలలోంచి కొన్ని భాగాలు

http://prajakala.org/audio/volga_02401.mp3

4) ఊరుకి ముందు మాలపల్లి

http://prajakala.org/audio/volga_02404.mp3

## అమ్మా తెలంగాణమా! ఆకలి కేకల గానమా!

తెలంగాణ సాంస్కృతిక శాంతియాత్ర నుండి రెండు పాటలు:

ఆడియో

1) అమ్మా తెలంగాణమా! ఆకలి కేకల గానమా!

ఆడియో:

http://prajakala.org/audio/Amma_Telanganama.mp3

## ఆదివాసుల ఆత్మబంధువు ఏడికెళ్ళెనే - విమల

ఆదివాసుల ఆత్మబంధువు ఏడికెళ్ళెనే
అడివీ బిడ్డల తోడునీడ ఏమైపోయెనే
తెలంగాణ కలల పంట నేలరాలినా
అది మొలకలెత్తి వేలవేల రాసులవునులే
………

http://prajakala.org/audio/Adivasula.mp3

## గమనిక:

రాయలసీమ, ఉత్తరాంధ్ర, తెలంగాణ, ప్రవాస ప్రజల నుండి వచ్చే అన్నిరకాల ప్రజాసాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావలని ప్రజాకళ ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నంలో భాగంగా రచయితలు, సాహిత్యాభిమానులు ప్రజాకళకు తమ రచనలను పంపించి సహకారం అందించవలసినది విజ్ఞప్తి చేస్తున్నాం.

------ ------ ముగింపు ----------------